





T/TG/2024/0523/7229/1544

# ఆకాంక్ష

తెలుగు డైలీ దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 11 ఎడిటర్ :పెనుగొండ సతీష్ మంగళవారం 29 ఏప్రిల్ 2025 పేజీలు 4 వెల 5.00




### తెలంగాణ ఇచ్చిన

## సోనియాను దేవత అనలేదా

- తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని ఎలా అంటారు
- అక్రమంగా పదిలక్షల కోట్లు సంపాదించిన కేసీఆర్
- కేసీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

(ఆకాంక్ష న్యూస్)

నల్గొండ, ఏప్రిల్ 28 : తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌నే విమర్శిస్తావా అని కేసీఆర్ తీరును మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కమార్ రెడ్డిలు ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లలో 10 వేల అబద్దాలు ఆడారని వారు విర్శించారు. ఏ మోహం పెట్టుకుని కాంగ్రెస్ ను విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ దేవత అని కేసీఆర్ గతంలో అనలేదా అని ప్రశ్నించారు. సోనియా కాళ్లు మొక్కిన వ్యక్తి కేసీఆర్ అని కోమటిరెడ్డి అన్నారు. పదేండ్లలో కేసీఆర్ అక్రమంగా 10 లక్షల కోట్లు సంపాదించారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో అవినీతికి పాల్పడిన అధికారులు కొందరు జైల్లో ఉంటే మరి కొందరు అమెరికాలో ఉన్నారని విమర్శించారు. తాము అబద్దాలు చెప్పి ఉంటే ఎప్పుడో అధికారం లోకి వచ్చే వాళ్లమన్నారు. మేం తల్చుకుంటే బీఆర్ఎస్ కంటే తలదన్నే మీటింగ్ పెట్టగలమన్నారు.తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే.. తెలంగాణవిలన్ కాంగ్రెస్‌పార్టీఅని దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

2లో

## బీఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్

- ఎక్కడా కానరాని మహిళలు
- కేసీఆర్ వ్యాఖ్యలపై చర్చకు సిద్ధం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని.. తెలంగాణ ఫస్ట్ అండ్ చివరి విలన్ కేసీఆర్ అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చర్చకు సిద్ధమన్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. టైం, వేదిక మీరే డిసైడ్ చేయండి.. చర్చకు ఎక్కడికి రమ్మన్నా

2లో

## రేవంత్‌కు కేసీఆర్ అండదండలు

- ఐదేళ్లు కొనసాగాలని అనడమే నిదర్శనం
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, ఏప్రిల్ 28 : రేవంత్‌కు కెసిఆర్ అండదండలు ఉన్నాయని, రేవంత్ ఐదేళ్లు కొనసాగాలని అనడమే నిదర్శనం అని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు చేశారు. ఇద్దరి మధ్య అవగాహన ఉందని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి కేసీఆర్, రేవంత్‌రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు.

2లో

## అధికారం పోయినా అహంకారం తగ్గలేదు

- కేసీఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి



(ఆకాంక్ష న్యూస్)

గజ్వేల్,ఏప్రిల్ 28 : అధికారం కోల్పోయినా కేసీఆర్‌కు ఇంకా అహంకారం తగ్గలేదని, కడుపు నిండా విషం నింపుకొని... మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిప్పులు చెరిగారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా సిద్ధిపేట జిల్లా, వర్గల్ మండలం, శాకారం టిజిఆర్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయనతోపాటు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ..

2లో



### అక్కసు వెళ్లగక్కేలా

## కేసీఆర్ ఎల్కతుర్తి ప్రసంగం

- బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదే
- నమ్ముకున్న వారికే పదువులు వస్తాయి
- జానారెడ్డి నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి చర్చలు

(ఆకాంక్ష న్యూస్)


హైదరాబాద్, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ రజతోత్సవ సభలో గులాబీ బాస్ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రసంగంలో పసలేదని.. ప్రభుత్వంపై ఆయన అక్కసంతా వెళ్లగక్కారని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లలో రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. కేసీఆర్ ఎన్ని చెప్పినా.. బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారన్నారు. కేసీఆర్ ప్రసంగంలో స్పష్టతే లేదన్నారు.

2లో

### అక్కడ బిగిసింది

## పిడికిళ్లు కాదు.. పిడుగులు..

- బీఆర్ఎస్ రజతోత్సవ సభపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, ఏప్రిల్ 28 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అక్కడ బిగిసింది పిడికిళ్లు కాదు..

## లోకాయుక్త, ఉపలోకాయుక్తల ప్రమాణం

- రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, ఏప్రిల్ 28 : హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో లోకాయుక్త, ఉపలోకాయుక్తల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనం గా జరిగింది. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, ఉపలోకా యుక్తగా బి.ఎస్.జగ్జీవన్ కుమార్ సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ముఖ్యమైన కార్య క్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

2లో



### సిఎస్‌గా రామకృష్ణారావు

## నియామకం

- సిఎం రేవంత్‌ను కలిసిన కొత్త సిఎస్
- హెచ్ఆర్‌డి వైస్ ఛైర్‌పర్సన్‌గా శాంతికుమారి

(ఆకాంక్ష న్యూస్)


హైదరాబాద్, ఏప్రిల్ 28 : నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె.రామకృష్ణారావును తెలంగాణ ప్రభు త్వం నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేసింది.

2లో

### ప్రజలను మభ్య పెట్టే

## యత్నంలో కేసీఆర్

- తెలంగాణకు ఏం చేశారో చెప్పలేని స్థితి
- బీఆర్ఎస్ మరింత పతనం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, ఏప్రిల్ 28 : బిఆర్ఎస్ వజ్రోత్సవ సభ వల్ల దేశానికి, రాష్టాన్రికి ఎలాంటి ప్రయోజనం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని, గెలు స్తామని ప్రకటించడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం తప్ప మరోటి లేదన్నారు. కేవలం మభ్య పెట్టే యత్నాల్లో కేసీఆర్ ఉన్నారని విమర్శించారు. బిఆర్ఎస్ తన

2లో

### కుటుంబ కలహాలతో

## కానరాని లోకాలకు మూడు నెలల గర్భిణీ....

- పెళ్లైన ఆరు నెలలకే ప్రేమ జంట ఆత్మహత్య
- విషాదాంతంగా మారిన ప్రేమ వ్యవహారం
- కొత్తగూడెం జిల్లా టేకులపల్లి లో విషాదం



కొత్తగూడెం(ఆకాంక్ష న్యూస్) : వారిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు... ఇద్దరి ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలియడంతో వారి పెళ్లికి పెద్దలు నిరాకరించారు. దీంతో ఇద్దరి కుటుంబ సభ్యులను ఎదిరించి మరి పెళ్లి చేసుకున్నారు. ఇకపై ఒకరినొకరు తోడుగా ఉండాలని నిర్ణయించుకొని ఇద్దరు ఒకటయ్యారు.. దీంతో పెళ్ళైన వారి జీవితం సజావుగా సాగుతున్న నేపథ్యంలో వారి కుటుంబంలో నెలకొన్న సమస్యలతో క్షణికావేశంలోనో, లేక జీవితంపై మనస్థాపం చెందో తెలియదు కానీ పెళ్ళైన ఆరు నెలలకే ప్రేమ జంట ఆత్మహత్య

2లో

# అక్కసు వెళ్లగక్కేలా కేసీఆర్ ఎల్కతుర్తి ప్రసంగం

మొదటిపేజీ తరువాయి

మా పిల్లలనే అసెంబ్లీలో ఎదుర్కొలేక పోతున్నారని కేసీఆర్ అంటున్నారు.. వాళ్ళు పిల్లలు అని తెలిశాక మరీ అసెంబ్లీకి ఎందుకు పంపిస్తున్నారని కౌంటర్ ఇచ్చారు. మేం కక్ష సాధింపు చర్యలకు దిగమని.. తాను ఇంకో 20 ఏండ్లు రాజకీయాల్లో ఉంటానని తెలిపారు. కేటీఆర్ కేసు అయినా.. ఫోన్ ట్యాపింగ్ కేసు అయినా చట్టపరంగానే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ మాదిరిగా చట్టానికి వ్యతిరేకంగా కేసులు పెట్టి జైల్లో వేయించమన్నారు. బీఆర్ఎస్ నేతల అరెస్టులపై డిమాండ్లు వస్తున్నా యని.. కానీ చట్టప్రకారవే నడుచుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర పథకాల ప్లానింగ్కే సరిపోయిందని.. ఇకపై పథకాల గ్రౌండింగ్ పై ఫోకస్ పెడతామని చెప్పారు.కేసీఆర్ మాదిరిగా లాంఛింగ్.. క్లోజింగ్ స్కీములు ఉండవని.. ఏదైనా ఒక పథకం ప్రారంభిస్తే అర్హులకు అందేవరకు పని చేస్తానని అన్నారు. రేవంత్ రెడ్డి చెప్పింది చేస్తాడు అనే నమ్మకం కలిగేలా పని చేస్తానని పేర్కొన్నారు. ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ప్రసంగం అక్కసుతో కూడుకున్నదని ఆరోపించారు.'కేసీఆర్ ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారు. భారాసను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు. రాహుల్గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం. రాహుల్కు, నాకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలని రేవంత్రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి. ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని రేవంత్ హెచ్చరించారు. కేసీఆర్ సభకు అవసరమైనన్ని బస్సులు సమకూర్చినప్పటికీ, గతంలో ఖమ్మంలో రాహుల్ గాంధీ సభకు బస్సులు ఇవ్వకపోవడం మోసపూరిత చర్య అని మండిపడ్డారు.ఫోన్ ట్యాపింగ్ కేసుల గురించి రేవంత్ మాట్లాడుతూ.. చట్టం మేరకే చర్యలు తీసుకుంటామని, కేసీఆర్ లాగా నేను చట్టాన్ని అతిక్రమించను అని ఆయన అన్నారు. కేటీఆర్ మీద ఉన్న కేసులు కూడా చట్ట ప్రకారమే సాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో తాను చేసిన వ్యాఖ్యలే కేసీఆర్ సభలో పునరావృతం చేశారని విమర్శించారు. కొంత మంది అధికారుల పని తీరు తెలిసినా, అవసరంగా ఉన్న కారణంగా వారి సేవలను కొనసాగించాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ల మార్పు వేరే విషయమని, అవసరమైన మార్పులు చేసుకుంటామని వివరించారు. నన్ను నమ్ముకున్న వారిని నేను ఎప్పటికీ మర్చిపోనని, నన్ను నమ్మిన వారిలో ఒకరైన దయాకర్కు ఎమ్మెల్సీ పదవి వచ్చిందని చెప్పారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్

మొదటిపేజీ తరువాయి

వస్తా? ఫాం హౌస్ దాటి వచ్చే దమ్ముందా కేసీఆర్? అంటూ సవాల్ విసిరారు. రజతోత్సవ సభలో జనాల కంటే విస్కీలు ఎక్కువ ఉన్నాయని.. సభలో అసలు మహిళలే కనిపించడం లేదన్నారు. వరంగల్ సభలో కేసీఆర్ ప్రసంగంలో పసలేదు.. ఆయన శకం ముగిసిందని వ్యాఖ్యానించారు.దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని.. నకిలీ గాంధీలు అనడం కేసీఆర్ దుస్సాహసానికి పరాకాష్ట అని మండిపడ్డారు.. కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బీజేపీ – బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ అనడానికి నిదర్శనం బీజేపీపై కేసీఆర్ రెండు నిమిషాల ప్రసంగమని ఆరోపించారు. బీజేపీపై కేసీఆర్ విమర్శలు నెమలి పింఛంతో కొట్టినట్లు– ఉందని.. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్రపన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ బిక్షతో ముఖ్యమంత్రి అయ్యావు అంటూ కేసీఆర్ను విమర్శించారు. గాంధీ కుటుంబం పెట్టిన రాజకీయ భిక్షతో దొంగ పాస్ పోర్టుల బిజినెస్ చేసుకునే మీ కుటుంబం లక్షల కోట్లకు పడగలెత్తారు.

# రేవంత్కు కేసీఆర్ అండదండలు

మొదటిపేజీ తరువాయి

ఉరితీసిన తప్పులేదని మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడినా... రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్రెడ్డికి కేసీఆర్ వెన్నంటి ఉన్నారని స్పష్టం అవుతుందని.. రాష్ట్ర ప్రభుత్వానికి కేసీఆర్ సపోర్ట్ చేస్తున్నారని మహేశ్వర్రెడ్డి ఆరోపించారు.. 5 సంవత్సరాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగాలని కేసీఆర్ అంటున్నారని.. అంటే ఆ రెండు పార్టీలు ఒకటే నని స్పష్టం అవుతుందన్నారు. వరంగల్ రజతోత్సవ సభలో కేసీఆర్ వ్యాఖ్యలపై బీజేఎల్పీ నేత స్పందించారు. కేసీఆర్ సభ కొండంత రాగం తీసి దిక్కుమాలిన పాట పాడినట్టుగా ఉందని విమర్శించారు. తెలంగాణ విధ్వంసానికి కారణం కేసీఆర్ అన్నారు. సభకోసం రూ.150 కోట్లు ఖర్చు చేసి కనీసం లక్ష మందిని కూడా జమ చేయలేక పోయారని ఆరోపించారు. సభ అట్టర్ ఫ్లాప్ అయింది. తెలంగాణ కు కేంద్రం ఎన్ని నిధులు ఇచ్చింది కేసీఆర్ నీకు తెలియదా? అన్ని తెలిసి 11 రూపాయలు కూడా ఇవ్వలేదని పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. మీరు పాలివ్వలేదని తెలిసే మిమ్మల్ని ప్రజలు ఓడించారు. మావోయిస్టులను చర్చలకు పిలువలేదు కేసీఆర్... మీ ప్రభుత్వంలో ఎన్కౌంటర్ లు చేయలేదా? హింసను వీడనాడి జన జీవనంలోకి రావాలని మావోయిస్టులకు విజ్ఞప్తి చెయ్యి.. అధికారం కోల్పోయి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారు.

# ప్రజలను మభ్య పెట్టే యత్నంలో కేసీఆర్

మొదటిపేజీ తరువాయి

పాలనలో ఆ పార్టీ ఏం చేసిందో, ఏం చేయలేదో చెప్పుకోలేక పోయిందని అభిప్రాయ పడ్డారు. తెలంగాణ ప్రజలకే ఏమీ చేయలేని ముఖ్యమంత్రి దేశా నికి ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కాకపోతే... అంతర్జాతీయ రాష్ట్ర సమితి పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తెరాస పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టడానికి, భాజపాను విమర్శించడానికి, ప్రజలను తప్పుదోవ పట్టించడానికే వజ్రోత్సవ సభ నిర్వహించిందని సంజయ్ విమర్శించారు.

# తెలంగాణ ఇచ్చిన సోనియాను దేవత అనలేదా...



మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ఇచ్చినప్పుడు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ ఆశీస్సులు తీసుకోలేదా? హైదరాబాద్తో కూడిన తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని అసెంబ్లీలో కేసీఆర్ అనలేదా? ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం క్రమక్రమంగా నెరవేరుస్తోంది. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి రూ.10వేల కోట్లు దోచుకుతిన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. మంత్రులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. పదేళ్లు పాలించిన కేసీఆర్.. ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. మరో దశాబ్దం నల్గొండ కాంగ్రెస్ దేన న్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. అభివృద్ధి విషయంలో తాము ఎక్కడా రాజీపడబో మన్నారు. నల్గొండకు రూ. 700 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు ఉత్తమ్. కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి అన్నారు. భవిష్యత్లోనూ కాంగ్రెస్ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్నారాయణపురం, చౌటుప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్–2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, భారాస నేతలు జేబులు నింపుకొన్నారు. భారాస నేతల కమీషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి.. అప్పులు చేసి కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు– ఖర్చు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్డీఎస్ఏ చెప్పింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని రాష్ట్రానికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కానీ, తెలంగాణకే 500 టీఎంసీలు కేటాయించాలని ఈ ప్రభుత్వం పోరాడుతోందని ఉత్తమ్ అన్నారు.

# కుటుంబ కలహాలతో కానరాని లోకాలకు మూడు నెలల గర్భిణీ

మొదటిపేజీ తరువాయి

చేసుకోవడం, ఆత్మహత్య చేసుకున్న సమయానికి మూడు నెలల గర్భవతి కావడం ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే... టేకులపల్లి మండలం దాస్ తాండ గ్రామపంచాయతీ రేగుల తాండకు చెందిన ఇస్లావ దీపిక (19)లు వెంకటయ్య తాండకు చెందిన బోడ శ్రీను (23)లు ఇద్దరు గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు. అయితే వీరి ప్రేమ వ్యవహారం పెద్దలకు తెలియడంతో వివాహంకు కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో ఇరు కుటుంబ సభ్యులను ఎదిరించి ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకొని వారికి దూరంగా ఉంటున్నారు. అయితే కొన్ని రోజుల క్రితం వెంకటయ్య తండాలోని శ్రీనివాస్ నివాసానికి అక్కడే ఉంటున్న సమయంలో గత రెండు నెలలుగా కుటుంబ సభ్యులు వరకట్నం తీసుకురావాలని ఒత్తిడి చేస్తూ ఉండడంతో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే దీపిక మూడు నెలల గర్భవతిగా తేలింది. ఈ సమయంలో ఎంతో ఆనందంగా గడపాల్సిన రెండు కుటుంబాలు వరకట్నం చిచ్చుతో విషాదంగా మారాయి. తరచూ వారి కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో విసిగిపోయిన ప్రేమ జంట మనస్థాపంతో ఈ నెల 24వ తేదీన కూల్ డ్రింక్ లో గడ్డి మందు, ఎలుకల మందు కలుపుకొని మొదట శ్రీను సేవించాడు. ఆ తర్వాత తాను మందు తాగిన విషయాన్ని ఇంటికి వచ్చి భార్యకు తెలిపాడు. వెంటనే భార్య దీపిక కూడా అదే కూల్ డ్రింకును తీసుకొని తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు భార్యాభర్తలను మొదట కొత్తగూడెం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిద్దరిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం జిల్లా హాస్పిటల్ కు తరలించారు. అయితే చికిత్స అందిస్తున్న సమయంలో ఈనెల 25వ తేదీన దీపిక మృతి చెందగా, అప్పటి నుండి చికిత్స పొందుతున్న శ్రీను సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. జీవితంపై ఎన్నో ఆశలతో పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్న ప్రేమ జంట కుటుంబ కలహాలతో తనువు చాలించడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఆత్మహత్య చేసుకునే సమయానికి దీపిక మూడు నెలల గర్భవతి కావడం అందరిని కలచివేసింది ఈ ఘటన కన్నీటి పర్యంతం అయింది.

# లోకాయుక్త, ఉపలోకాయుక్తల ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి ,బి.ఎస్.జగ్జీవన్ కుమార్లు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తూ, రాష్ట్రంలో అవినీతిని నిరోధించడానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా హాజరైన వారు ఆశాభావం వ్యక్తం చేశారు. వీరి నియామకం రాష్ట్ర పాలనలో మరింత పారదర్శకత , జవాబుదారీతనాన్ని పెంచుతుందని భావిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా పరిగణించబడుతోంది.

# పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయాం

## - కాశ్మీర్ అసెంబ్లీలో సిఎం ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలు

(ఆకాంక్ష న్యూస్)

శ్రీనగర్, ఏప్రిల్ 28 :పహల్గామ్ ఉగ్ర దాడిని ఖండిస్తూ జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ తీర్మానం చేసింది. మృతులకు ఘనంగానివాళి అర్పించింది.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతిని ప్రకటించింది. ఈసందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర ప్రసంగం చేశారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత దేశంలోని ప్రతి ప్రాంతం ఆవేదనకు గురైందన్నారు. ఉత్తరం నుంచి దక్షిణం వరకు తూర్పు నుంచి పడమర వరకు ఇలా ప్రతి ప్రాంతం దిగ్భ్రాంతికి గురైందని గుర్తుచేశారు. ఉగ్రదాడి తర్వాత కాశ్మీర్అంతా ఐక్యంగాఉందని గుర్తు చేశారు.

# పెయింటింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన సిఎం రేవంత్



హైదరాబాద్, ఏప్రిల్28 :హైదరాబాద్ కావూరి హిల్స్లో చిత్రకారుడు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మాదాపూర్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారుడు నవీన్ రెడ్డి గీసిన చిత్రాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. మే 4వ తేదీ వరకు ఈ చిత్ర ప్రదర్శన సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కృష్ణతత్తంపై నవీన్ రెడ్డి వేసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యూఎస్ కాన్సుల్ జనరల్ జెనిఫర్, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికారం పోయినా అహంకారం తగ్గలేదు

మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వ హయాంలో నియంతలా వ్యవహరించిన కెసిఆర్ సొంత పార్టీ ఎంఎల్ఎలను కూడా కలిసేందుకు ఒప్పుకోలేదని వ్యాఖ్యానించారు. ఇపుడు తగుదునమ్మా అంటూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. రైతులు ఆత్మగౌరవంతో బ్రతికేందుకే తాము భూ భారతి చట్టం తీసుకువచ్చామని, తమ అక్రమాలు బయటపడతాయనే బిఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. తాము రైతులకురూ.2 లక్షల రుణమాఫీ చేసినందుకా, మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నందుకా, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నందుకా, పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నందుకా, మీ ఏడుపులు, పెడబొబ్బలు అంటూ కెసిఆర్ ను ప్రశ్నించారు. రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టు–కోగా, గజ్వేల్ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయిస్తున్నట్లు– తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనూ చౌదరి, అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్, ఎంఎల్ఎ నాయిని రాజేందర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ– అధ్యక్షుడు తుకుంట నర్సారెడ్డి, డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, నాయకుడు భూమ్ రెడ్డి ఎలక్షన్ రెడ్డి, గజ్వేల్, వంటిమామిడి, కొండపాక మార్కెట్ కమిటీ– ఛైర్మన్లు నరేందర్ రెడ్డి, విజయ మోహన్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డిఓ చంద్రకళ, తహసిల్దార్ బాలరాజులు పాల్గొన్నారు.

# సిఎస్గా రామకృష్ణారావు నియామకం

మొదటిపేజీ తరువాయి

సీనియారిటీ జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 1991 ఐఏఎస్ బ్యాచ్కు చెందిన రామకృష్ణారావును సీఎస్గా నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.ఈ క్రమంలో రామకృష్ణారావు సోమవారం సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం ఆయనను అభినందించారు. ఇదిలావుంటే పదవీ విరమణ చేస్తున్న సీఎస్ శాంతి కుమారికి కీలక బాధ్యత అప్పగించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్హెచ్ఆర్డీ) వైస్ ఛైర్పర్సన్గా శాంతి కుమారి పేరును ప్రభుత్వం ప్రకటించింది. సీఎస్ పదవి విరమణ తర్వాత... ఆమె ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.

# అధికారం పోయినా అహంకారం తగ్గలేదు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన దేవత సోనియా గాంధీకి సాష్టాంగ ప్రణామం చేసిన కెసిఆర్.. కాలం తిరగబడి ప్రజలు బుద్ధి చెప్పడంతో కాంగ్రెస్ను విలన్గా చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానాను నిండా ముంచిన కెసిఆర్ కనీసం గ్రామస్థాయి సర్పంచులకు కూడా బిల్లు ఇవ్వకపోగా, తప్పును తమపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేదాకా పోరాటం ఆగదు

## - రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేతనాల పెంపుకై వెంటనే చర్యలు తీసుకోవాలి

యైటింక్లైయిన్ కాలనీ(ఆకాంక్ష న్యూస్) : కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేదాకా పోరాటం ఆగదని, వెంటనే కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేతనాల పెంపుపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఉల్లి మొగిలి, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకలరమేష్, ఐఎఫ్ టీ యూ రాష్ట్ర అధ్యక్షులు కెవిశ్వనాథ్, టీసీకేఎస్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, ఏఐఎఫ్ టీ యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి రత్నకుమార్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో యైటింక్లైయిన్ కాలనీ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటుందని, కోల్ ఇండియా ఒప్పందాలను సైతం అమలు చేయకుండా కాంట్రాక్ట్ కార్మికులను వెట్టిచాకిరికీ గురిచేస్తుందని ఆరోపించారు. గతంలో సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం లేబర్ కమిషనర్ సమక్షంలో చేసుకున్న అగ్రిమెంటు సైతం అమలు చేయడం లేదని ఈ స్థితిలో సింగరేణి వ్యాప్తంగా మళ్లీ పోరాటం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. దానిలో భాగంగా ఈ నెల 30వ తేదీన కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు నిరసన దీక్ష మహా ధర్నా చేపట్టాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. మే డే రోజున వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 30న జరిగే నిరసన దీక్ష మహా ధర్నాలో సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అర్జీ-2 పర్సనల్ ఆఫీసర్ అనిల్ కుమార్ కు వేతనాలు పెంచాలని వినతిపత్రం అందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ముష్కి రామస్వామి, దాముక లచ్చన్న, రవి నాని పాల్గొన్నారు

# విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

## - ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు
## - ఎన్టీపీసీ జడ్పిఎచ్ఎస్‌లో వాలంటీర్లకు శిక్షణ
## - పెద్దపల్లి జిల్లా డిఈవో డి.మాదవి



(ఆకాంక్ష న్యూస్)

కోల్‌సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 28 : విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిం చాలని పెద్దపల్లి డిఈవో మాదవి వాలంటీర్లకు సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో వేసవి కాలంలో విద్యార్థులకు లర్నింగ్‌లో విరామం లేకుండా ఉండేందుకుగాను వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరం-2025ను మే 1నుండి జూన్ 10 వరకు నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి రామగుండం మండలంలోని ప్రభుత్వ పాఠశాల పరిధిలోని గ్రామములో డిగ్రీ చదువుకున్న అభ్యర్థులను వాలంటీర్లుగా ఎంపిక చేశామని ఆమె వివరించారు. గోదావరిఖని ఎన్టీపీసీ టిటిఎస్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామగుండం మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య అధ్యక్షతన సోమవారం వాలంరీట్లకు శిక్షణను ఇచ్చారు. ఈ శిక్షణలో రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల వాలంటరీలు పాల్గొన్నారు. దాదాపు 90మంది వాలంట రీలకు జిల్లా రిసోర్స్ పర్సన్లు రవి, సంపత్ రెడ్డిలు ఒక రోజు శిక్షణను అందించారు. ఈ శిక్షణకు పెద్దపల్లి జిల్లా విద్యాధికారి డి.మాదవి పాల్గొని మాట్లాడారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలోని సామర్థ్యలను, లెర్నింగ్ గ్యాప్స్ లేకుండా ఈ వేసవి శిక్షణ శిబిరం ఉపయోగపడుతుందన్నారు ప్రతి రోజు ఉదయం 8గంటల నుండి 10:30 వరకు వాలంటరీలు ఆటలు, డ్రాయింగ్, తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు బోదిస్తారని అన్నారు. అంతర్గాం మండల విద్యాధికారి ఏకాంబరం, పాలకుర్తి మండల విద్యాధికారి విమల, మూడు మండలాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంగీత, కమలాకర్ రావు, గాయత్రిదేవి, గోపి, భూమయ్య, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ రామ్ కుమార్, వెంకట్, శ్రీను, సతీష్, శ్రీలత, గౌస్, జ్యోతి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల అడగడానికి వస్తే నిలదీయండి


## రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు... మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీసి అడగాలని రామగుండం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆరోజే కేసీఆర్ అన్నారని తెలిపారు. అలాగే ఈ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ వెంటనే నిలిపివేయాలని మావోయిస్టులతో చర్చలు జరపాలని పిలుపునిచ్చారు.

# గ్రామ రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించండి

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



(ఆకాంక్ష న్యూస్)

నిర్మల్, ఏప్రిల్ 28: గ్రామ రెవెన్యూ సదస్సులను సమగ్రంగా, సమయానుసారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని మండలాల తహసీల్దార్లతో భూభారతి, రెవెన్యూ సదస్సులు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, వరి కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేసారు. గతంలో నిర్వహించిన సదస్సులు, గుర్తించిన సమస్యల వివరాలను మండలాల వారీగా తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పంచాయితీలో గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహించి, భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే అన్ని మండలాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. తహసిల్దార్లంతా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ, టార్పాలిన్స్, గన్ని బ్యాగ్స్ తదితర సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో జిల్లాకు వర్ష సూచన ఉన్నందున, రైతులందరూ తమ ధాన్యాన్ని కాపాడుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సందర్శించి, చెరువుల ఎఫ్ టిఎల్ హద్దులను గుర్తించాలన్నారు. చెరువులు ఆక్రమణలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి తగినంత ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. రెవెన్యూ భూ రికార్డులను స్కాన్ చేసి, డిజిటల్ రూపంలో భద్రపరచాలన్నారు. వేసవి నేపత్యంలో గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలనీ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, భైంసా ఆర్డిఓ కోమల్ రెడ్డి, రెవెన్యూ అధికారులు సవిత, స్వాతి, ఈడిఎం నదీమ్, తదితరులు పాల్గొన్నారు.

# అస్పత్రి తనిఖీకి వచ్చిన డీఎంఅండ్ హెచ్ఓ పట్ల ప్రవర్తించిన తీరు దుర్మార్గం..

## - నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు హాస్పిటల్స్ పై చర్యలు చేపట్టండి
## - న్యూ ఇండియా పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు వేముల అశోక్



గోదావరిఖనిటౌన్ (ఆకాంక్ష న్యూస్) : పెద్ద పల్లి జిల్లా గోదావరిఖని స్వతంత్రచౌక్ లోని శ్రీ మమత హాస్పిటల్ కు తనిఖీ చేయడానికి వచ్చిన పెద్దపల్లి డీఎంఅండ్ హెచ్ఓ పట్ల హాస్పిటల్ యాజమాన్యం, ఐఎంఏ సభ్యులు రాజకీయ నాయకులు ప్రవర్తించిన తీరు దుర్మార్గం అని మీ ప్రవర్తన పట్ల సమాజానికి ప్రజలకు ఏమి సంకేతాలు ఇస్తున్నారని న్యూ ఇండియా పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు వేముల అశోక్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డీఎంఅండ్ హెచ్ఓ గోదావరిఖని పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్స్ ను సందర్శించి పర్యవేక్షణ చేస్తూ రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులరేషన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న హాస్పిటల్స్,ల్యాబ్స్, స్కానింగ్ సెంటర్స్, ఏ విధమైన పర్మిషన్స్ లేకుండా నిబంధలను నియమాలను పాటించకుండా నిర్వహిస్తునన్న యాజమాన్యాల మీద ఉక్కు పాదం మోపడం చాలా సంతోషకర విషయం అన్నారు. అయితే వైద్యాధికారి తనిఖీ కోసం వచ్చిన సమయంలో ఇలాంటి అక్రమ అనుమతులు లేని స్కానింగ్ మిషన్లు పెట్టి అక్రమ మార్గాలలో డబ్బు సంపాదిస్తున్న కొంత మంది హాస్పిటల్ యాజమాన్యం సహకరించకుండా రాజకీయ నాయకులతో కలసి నాన రభస చేయడం దుర్మార్గం దుష్ట చర్య ఇది వారి విజ్ఞతకే వదిలేద్దాం అని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో గోదావరిఖని పట్టణంలో చాలా హాస్పిటల్ కి ఏ విధమైన డీఎంఅండ్ హెచ్ఓ నియమ నిబంధనలకు లోబడి అనుమతులు లేవని మరియు హాస్పిటల్లో %ాు% థియేటర్ కానీ ఓపీ ఛాంబర్స్ కానీ మరుగుదొడ్లు, బాత్రూంలు, వాటర్ సౌకర్యం, వార్డులు, ఐసీయూ, పార్కింగ్ స్థలం, ఫైర్ సేఫ్టీ, వెంటిలేషన్, ముఖ్యంగా లిఫ్ట్ లేకుండా ర్యాంపు లేకుండా మెట్ల పై నుండి పేషెంట్ ని ఒక ఫ్లోర్ నుండి ఒక ఫ్లోర్ కి షిఫ్ట్ చేయడానికి అనువుగా లేని అతి డేంజరస్ హాస్పిటల్స్ నియమ నిబంధనలకు హాస్పిటల్ పనికొచ్చే వాతావరణం ఆవరణలో లేనివి ఎన్నో ఉన్నాయని అన్నారు. డీఎంఅండ్ హెచ్ఓ ప్రతి హాస్పిటల్ సందర్శించి పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. అలాగే నిబంధనలకు అనుగుణంగా లేని నిబంధనలను పాటించని హాస్పిటల్స్ పై చట్టపరమైన చర్యలు చేపట్టి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెద్దపల్లి జిల్లా కలెక్టర్ హాస్పిటల్ చేస్తున్న సమయంలో ఒక వీడియో గ్రాఫర్ ను పెట్టి ప్రతిదీ వీడియో రికార్డు చేయించాలని ఇలాంటి నిజాయితీగా పని చేసే డీఎంఅండ్ హెచ్ఓ కు ఒత్తిళ్లు లేకుండా విధులను నిజాయితీగా నిర్వహించాలని ఆయన కోరారు.



# మేజిక్ రాజాకు అరుదైన గౌరవం

## - పల్నాడులో సన్మానం

(ఆకాంక్ష న్యూస్)

కోల్‌సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 28: 'ఖని' కళాకారుడు మేజిక్ రాజాకు ఆంధ్రప్రదేశ్ లో అరుదైన గౌరవం దక్కింది. పల్నాడు జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో ఆదివారం జరిగిన పల్నాడు మేజిక్ ఫెస్టివల్-2025 కు రాజా వ్యాఖ్యాతగా వ్యవహరించి తన సమయస్ఫూర్తి, ఛలోక్తులతో కార్యక్రమాన్ని ఆద్యంతం రక్తి కట్టించి సభికుల అభినందనలందుకున్నారు. అలాగే కరీంనగర్ కు చెందిన మెజీషియన్ నరేన్ లెక్చర్ కమ్ డెమానిస్ట్రేషన్.. సీనియర్ల ప్రశంసలందుకుంది. కాగా రాజా, నరేన్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యతిరాజ్ ను అతిథులు, నిర్వాహకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి ఫోటోతో కూడిన జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమం లో నిర్వాహకులు, అసోసియేషన్ వ్యవస్థాపకులు జేవిఆర్, అధ్యక్షులు వై.బాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు, కోశాధికారి పి.నాగేంద్ర ప్రసాద్, సీనియర్ మెజీషియన్లు డాక్టర్ బోస్, డాక్టర్ ఎస్. మనోహర్ రావు, డాక్టర్ ఆర్యల్, ఆలీ, ప్రదీప్ రంగ్రేజ్, రఘు బాబు, సామల వేణు, శ్యామ్, క్రాంతికార్, కేబీ విరాట్ వాలా, గౌస్, కే.విజయ్ కుమార్, టైగర్ మహ్మద్, ఎన్ఆర్ కరెంట్, మధుబాలతో పాటు ఖని కళాకారులు మేజిక్ హరి, చంద్రపాల్, ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి సుమారు మూడు వందల మంది ఇంద్రజాలికులు పాల్గొన్నారు. కాగా మేజిక్ రాజాకు ఈ అరుదైన గౌరవం దక్కడంపట్ల స్థానిక కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# ఉద్రిక్తతల నివారణకు దౌత్యమే శరణ్యం

## - పాక్ ప్రధానికి షహబాజ్‌కు మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సూచన

(ఆకాంక్ష న్యూస్)

ఇస్లామాబాద్, ఏప్రిల్ 28 : పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్, పాక్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. భారత్ ఎలాంటి తీవ్ర చర్యలు తీసుకుంటుందో అన్న భయాందోళనలు నెలకొన్నాయి. ప్రపంచదేశాలు సైతం పాక్‌ను దుమ్మెత్తి పోస్తున్నాయి. ఈ క్రమంలో ఈ పరిస్థితులను దౌత్య మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. రెండు అణ్వాయుధ దేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను వినియోగించుకోవాలని తన సోదరుడు, ప్రస్తుత ప్రధాని షెహబాజ్‌కు సూచించినట్లు వార్తలు వచ్చాయి. నవాజ్ నివాసంలో వీరి మధ్య సమావేశం జరిగింది పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు- పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు- మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు



వెల్లడించింది. ఈ దాడి తర్వాత పాక్ నేతలు ప్రేలాపనలు చేస్తున్నారు. భారత్‌పై దాడి చేసేందుకే 130 అణుబాంబులు సిద్ధంగా ఉంచినట్లు- పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ బహిరంగ బెదిరింపులకు దిగారు. మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షల్లో హిందూ, ముస్లింలు వేర్వేరు. వీటి ఆధారంగానే రెండు దేశాలు ఉండాలనే భావన ఏర్పడింది. పాకిస్థాన్ ఏర్పాటుకు పూర్వీకులు ఎన్నో త్యాగాలు చేశారు. వాటిని ఎలా కాపాడుకోవాలో మనకు తెలుసని పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. పాక్ మాజీ విదేశాంగ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ భిలావల్ భుట్టో జర్దారీ నోరు పారేసుకుకున్న సంగతి తెలిసిందే. సింధూ నదిలో నీరు పారకపోతే.. రక్తం పారుతుందంటూ ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధూ నది తమదేనని, ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో నవాజ్ స్పందన వచ్చింది.

# పెట్రోల్‌పై ఎక్సైజ్, వ్యాట్ ధరలు తగ్గిస్తే సామాన్యులకు ఊరట




(ఆకాంక్ష న్యూస్)


న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 : దేశంలో పెరుగుతున్న దరల కారణంగా పెట్రో ధరలను కంట్రోల్ చేస్తే..ఇతరత్రా రవణా ఛార్జీలు తగ్గుతాయి. ఆ మేరకు సరుకులపైనా ధరలు తగ్గుతాయి. ఈ తరహా ఆలోచన చేయడం లేదు. గత ఐదారేళ్లుగా పెట్రో ధరలపై ప్రధాని అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిజానికి చమురు కంపెనీలు గనుక ఈ విధంగా ధరలను పెంచిన్నట్లైతే, అది అక్కడితో ఆగిపోదు. మొత్తం ఆర్థిక వ్యవస్థలో అనేక వస్తువుల ధరలు దాని ఫలితంగా పెరుగుతాయి. కాంగ్రెస్ హయాంలో పెట్రో ధరలపై విరుచుకు పడ్డ మోడీ ఇప్పుడా విషయం మరచిపోయినట్లు ఉన్నారు. ధరల పెరుగుదాల, జిఎస్టీపైనా గుజరాత్ సిఎంగా విమర్శలు గుప్పించిన విషయం ప్రజలు ఇంకా మరచి పోలేదు. నిజానికి కేంద్రంపెట్రోల్‌పై ముందుగా ఎక్సైజ్ డ్యూటీ తగ్గించివుంటే బాగుండేది. ఆ తర్వాత వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలకు చెప్పివుంటే మోడీ నిజాయితీగా ఉన్నాడని అనుకునే వారం. మోడీ అధికారంలోకి వచ్చాక లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.18 కిపైగా పెంచారని కాంగ్రెస్ నేతలు పదేపదే చెబుతూనే వచ్చారు. యూపీఏ హయాంలో లీటర్ పెట్రోల్‌పై రూ.9.84 ఎక్సైజ్ డ్యూటీ ఉండగా.. మోడీ దాన్ని రూ.27.90కు, లీటర్ డీజిల్‌పై రూ.3.56గా ఉన్న సుంకాన్ని రూ.21.80కు పెంచారు. వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలను కోరే ముందు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి చిత్తశుద్ధి చాటుకుంటే బాగుండేది. ఇదిలా ఉంటే సెంట్రల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో లక్షల కోట్లు ఆదాయం వస్తున్న విషయాన్ని ప్రధాని ప్రజలకు చెప్పడం లేదు. ఎక్సైజ్ సుంకం ద్వారా కేంద్రానికి రూ.26 లక్షల కోట్ల ఆదాయం వచ్చిన విషయాన్ని ప్రధాని ఎక్కడా ప్రస్తావించడంలేదు. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాల వాటాను సకాలంలో చెల్లించడం లేదు. కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని..ఆ తర్వాత రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలి. అప్పుడే పెట్రో ధరలు తగ్గి రవాణా ఛార్జీలు తగ్గుతాయి. దీంతో సరకు రావాణా భారం కూడా తగ్గుతుంది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, అక్కడి ప్రభుత్వాలు విలువ ఆధారిత పన్ను వ్యాట్ తగ్గించకపోవడమే ఇందుకు కారణమని బిజెపి నేతలు నీతులు వల్లిస్తున్నారు. ఓ రకంగా పెట్రో ధరలపై రాష్ట్రాలను అప్రతిష్ఠపాలు చేయాలన్న ఆలోచన తప్ప నిర్మాణాత్మక ఆలోచన మాత్రం చేయడం లేదు. సామాన్య ప్రజలకు ఊరట కలిగించడానికి, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ,వ్యాట్ తగ్గించాల్సిందే. అప్పుడు ప్రభుత్వం కూడా తన వ్యయాన్ని ఆ మేరకు పెంచవలసి వుంటుంది. ఆ విధంగా అదనపు వ్యయం చేయాలంటే అందుకోసం ప్రభుత్వం తన ఆదాయాన్నీ పెంచుకోవాలి, అందుకు ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల మీద తనకు వచ్చే పన్ను ఆదాయాన్ని పెంచు కోవాలి. ప్రభుత్వం మాదిరిగానే పెట్రో ఉత్పత్తులను వినియోగించే ప్రతీ సంస్థ ఆర్‌టిసి, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలువంటివి కూడా తమ సేవల రేట్లు పెంచవలసి వుంటుంది. ఇదంతా కలిసి ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయి. ఇంతటితోనే ఇది ఆగదని, రాబోయే రోజుల్లో ఇదే విధమైన వడ్డింపులు మరిన్ని రానున్నా యని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అటు కంపెనీలూ చమురు పెరుగుదల భారాన్ని భరించడానికి సిద్ధంగా లేవు. ఇటు ప్రభుత్వమూ పెరిగే ధరల ద్వారా తనకు లభించే అదనపు ఆదాయాన్ని వదులు కోడానికి సిద్ధంగా లేదు. భారమంతా వినియోగదారులపైనే పడేయడం ద్వారాచేతులు దులుపుకోవాలన్న ధోరణిలో పాలకులు ఉన్నారు.

# ధాన్య కొనుగోళ్లు చేపట్టండి

## - కొనుగోలు కేంద్రాల్లో పేరుకుంటున్న ధాన్యం

(ఆకాంక్ష న్యూస్)

నిజామాబాద్, ఏప్రిల్ 28 : సకాలంలో ధాన్యం కొనుగోళ్లు జరగక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి రైతులు తమ ధాన్యంతో పడిగాపులు కాస్తున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అకాల వర్షాలు వారిని ఆందోళనకు గురిచేస్తోంది. లారీ కాంట్రాక్టర్లు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. నిజామాబాద్ జిల్లాలో అన్నదాతలు పండించిన బంగారం కుప్పలు తెప్పలుగా కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయింది. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ ధాన్యం రాశులు కళ్లెదుటే క్షీణిస్తుంటే రైతుల గుండెలు మాత్రం ఆందోళనతో కొట్టుకుంటున్నాయి. దీనికి కారణం లారీల కొరత.. ధాన్యాన్ని తరలించేందుకు లారీలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు కేంద్రాలు ధాన్యం కుప్పలతో నిండిపోయాయి. ధాన్యం తరలింపునకు వినియోగించాల్సిన లారీలను నల్ల మట్టి, ఇసుక వంటి ఇతర వ్యాపారాలకు మళ్లిస్తుండటంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాన్ని, నష్టాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడుతున్నారు. ఒక్కో గింజను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ఎన్నో కష్టనష్టాలకోర్చి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు పడుతున్న బాధ వర్ణనాతీతం. సమయానికి ధాన్యం తరలింపు



జరగకపోవడంతో నాణ్యత తగ్గిపోతోంది. మరోవైపు అప్పులు తెచ్చి వ్యవసాయం చేసిన రైతులు వాటిని తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు- చేసింది బాగానే ఉంది. కానీ, ధాన్యం తరలింపునకు సరైన వ్యవస్థ లేకపోతే ఈ కేంద్రాలు రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయి..? లారీ కాంట్రాక్టర్ల స్వార్థపూరిత చర్యలకు అడ్డుకట్ట వేయకపోతే, రైతుల కష్టాలు ఇలాగే కొనసాగుతాయి. ఇప్పటి-కై-నా అధికారులు స్పందించి, తక్షణమే లారీలను అందుబాటు-లోకి తెచ్చి ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటు-న్నారు. లేదంటే, పండించిన పంట కళ్లెదుటే మట్టిపాలై, వారి జీవితాలు మరింత దుర్భరంగా మారే ప్రమాదం ఉంది.

# పహల్గాం దాడిపై అనుచిత పోస్ట్

## - బోజ్‌పురి గాయనిపై కేసు నమోదు

(ఆకాంక్ష న్యూస్)

లక్నో, ఏప్రిల్28 :ప్రపంచ నేతలు, ప్రపంచ పౌరులు పహల్గాం దాడిని నిర్ద్వందంగా ఖండిస్తుంటే, భోజ్‌పురి గాయని..నేహా సింగ్ రాథోడ్ మాత్రం భద్రతా వైఫల్యం అంటూ పోస్ట్ చేసింది. 26 మంది పౌరుల ప్రాణాలను బలిగొన్న ఇటీవలి పహల్గామ్ ఉగ్రవాద దాడి, ప్రభుత్వం, నిఘా, భద్రతా వైఫల్యం అని పేర్కొంటూ పోస్టులు పెట్టింది. దేశానికి తమ వంతు అండగా ఉండాల్సి భారత పౌరురాలు, గాయని అయి ఉండీ కూడా ఏ మాత్రం సిగ్గులేకుండా నిస్సిగ్గుగా మోడీ ప్రభుత్వంపై రాజకీయం చేస్తూ.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. పహల్గాం దాడి పేరుతో ప్రధాని మోడీ ఇప్పుడు బీహార్‌లో ఓట్లు అడుగుతారని ఆమె చేసిన వీడియోను పాకిస్తాన్ జర్నలిస్టుల బృందం నిర్వహిస్తున్న హ్యాండిల్ తిరిగి పోస్ట్ చేయడంతో లక్నోలోని హజ్రత్‌గంజ్‌లో నేహాపై కేసు నమోదైంది. ఈ గాయని గతంలో కూడా ఇలాంటి సోషల్ మీడియా తప్పుడు మాటలు, తప్పుడు పోస్టులు చేసి వివాదాల్లో చిక్కుకుంది. అయినా ఈమెకు తెలిసిరాక, మళ్లీ దేశం మీద తెగబడింది.


# సీఎం రేవంత్ భయానికే అసెంబ్లీకి కెసిఆర్ డుమ్మా

## - కాంగ్రెస్‌ను పొగిడి..ఇప్పుడు విమర్శలా

## - మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి

(ఆకాంక్ష న్యూస్)

సంగారెడ్డి, ఏప్రిల్ 28 : గాంధీ కుటుంబంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి తిప్పికొట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి భయానికే కేసీఆర్ అసెంబ్లీకి పోవడం లేదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్‌ను కడిగేస్తాడు అని భయం పట్టుకుందన్నారు. అది తప్పించు కోవడానికి అసెంబ్లీకి పోవడం లేదన్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌పై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అంటే నాకు గౌరవం. పరిపూర్ణత చెందిన నాయకుడి అని నేను భావిస్తా. కేసీఆర్ పదేళ్లు సీఎంగా పని చేశారు... చాలా అనుభవజ్ఞులు అని జగ్గారెడ్డి అన్నారు. కానీ.. రేవంత్, కేసీఆర్ సభలో ఎదురు పడండి తెలంగాణ శాసనసభ ఎట్లా ఉంటాదొ చూద్దాని సవాల్ విసిరారు. నిన్న రజతోత్సవ సభలో కేసీఆర్ వ్యాఖ్యలపై జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. గాంధీ కుటు-ంబం కోసం నెలలు నెలలు వెయిట్ చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చే వరకు గాంధీ కుటు-ంబం హీరో అని కొనియాడారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత డబ్లికేట్ గాంధీలు అయ్యారా? అని ప్రశ్నించారు. ప్రజల పట్ల కాంగ్రెస్ హీరో అని.. ప్రతిపక్షానికి విలన్ అన్నారు. బీఆర్ఎస్ ఉనికి కాపాడుకునే పనిలో సభలో జరిగిందన్నారు.. కేసీఆర్ పదేళ్లు సీఎంగా పని చేశారు... చాలా అనుభవజ్ఞులని జగ్గారెడ్డి అన్నారు. ఇప్పుడు గతాన్ని మర్చిపోయి మాట్లాడారని.. డుబ్లికెట్ గాంధీలు అనడం ఆశ్చర్యం అనిపించిందని జగ్గారెడ్డి చెప్పారు. కేసీఆర్ తెలంగాణ నినాదం నుంచి వెనక్కి తగ్గాలని అనుకున్న సమయంలో ఆయన్ని లేపింది కాంగ్రెస్ నేతలే అని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విభజన జరగాలి అని మా పార్టీ నేతలే వెనక నిలబడి నడిపించారన్నారు. కాంగ్రెస్ నాయకత్వం వెనకాల లేకుంటే కేసీఆర్ దీక్ష జరిగేది కాదు.. ఇది వాస్తవం విమర్శ కోసం చెప్పడం లేదు. రాహుల్ గాంధీ పై కేసీఆర్ మాట జారాడు. మీ మాట పై మీకే విలువ లేదా..? సోనియా గాంధీ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు అని చెప్పింది నువ్వే కదా..? రాహుల్ గాంధీ తెలంగాణ



ఇచ్చేయండి అని చెప్పిన తర్వాతే ... పక్రియ మొదలైంది. అప్పుడేమో.. రాహుల్..సోనియా గాంధీ దేవుళ్ళు అన్నావు. ఇప్పుడు కేసీఆర్ కడుపు నిండి ఉన్నది కాబట్టి దయ్యాలు అయ్యారా ఇవాళ. కేసీఆర్ అనవసరంగా మాట తూలుతున్నారు. నీ పార్టీకి నువ్వు ఎట్లా ప్రచారం చేశావో.. మా పార్టీకి రాహుల్ గాంధీ ప్రచారం చేశారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పాలి. బేషరతుగా క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ అంటే నాకు గౌరవం. పరిపూర్ణత చెందిన నాయకుడి అని నేను భావిస్తా. కానీ ఈ వయసులో ఇంత దిగజారి మాట్లాడుడు అవసరమా..? ఎథిక్స్ తో రాజకీయాల్లో ఉన్న కుటుంబం కేవలం రాహుల్ గాంధీ కుటుంబమే. బ్రిటిష్ పాలన లో కూడా లక్షల కోట్లు- ఆస్తులు ధారాదత్తం చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం. బీఆర్ఎస్ ఢిల్లీకి సంచులు మోయలేదా..? ఢిల్లీ.. ఒరిస్సా.. పంజాబ్.. కర్ణాటక.. తమిళనాడు.. డబ్బులు పంపింది నువ్వు కాదా..? ఆరేడు రాష్ట్రాలకు సంచులు పంపింది కేసీఆర్ కాదా..?అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

# భారత్‌పై విషం కక్కుతున్న పాక్ యూట్యూబ్ చానెళ్లు

## - డాన్, జియో న్యూస్ వంటి యూట్యూబ్ చానెళ్లపై నిషేధం

## - పహల్గామ్ దాడిపై బిబిసి వార్తకు కూడా ఖండన

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 : భారత్ గురించి 'తప్పుడు, రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను' ప్రసారం చేస్తున్నాయనే ఆరోపణపై 16 పాకిస్తానీ యూట్యూబ్ చానెళ్లను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. అదే సమయలో పహల్గామ్ దాడిపై బిబిసి ప్రసారం చేసిన వార్తకు కూడా కేంద్రం తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేసిందని అధికారులు సోమవారం వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్‌లోని పర్యాటక పట్టణం పహల్గామ్ మైదాన ప్రాంతంలో ఈ నెల 22వ ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నది. ఆదాడిలో పర్యాటకులతో సహా 26 మంది వ్యక్తులు హతులైన విషయం విదితమే.ఉగ్రవాదులను తీవ్ర వాదులుగా పేర్కొన్న బిబిసిప్రసారం చేసే వార్తలను విదేశాంగ మంత్రిత్వశాఖ పర్యవేక్షించనున్నదని అధికారులుతెలిపారు.కేంద్రం నిషేధించిన పాక్ యూట్యూబ్ చానెళ్లు డాన్ న్యూస్, ఇర్షాద్ భట్టి, సమా టివి, ఎఆర్‌వై న్యూస్, బిఒఎల న్యూస్, రఫ్తార్, ది పాకిస్తాన్ రెఫరెన్స్, జియో న్యూస్, సమా స్పోర్ట్స్, జిఎన్ఎన్, ఉజెయిన్ క్రికెట్, ఉమర్ చీమా ఎక్స్‌క్లూజివ్, ఆస్మా షిరాజి, మునీబ్ ఫారూఖ్, సునో న్యూస్, రజీ నామా. 'జమ్మూకాశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో భారత్‌పైన, దాని సైన్యం, భద్రతా సంస్థలపైన రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను. అసత్య, తప్పుదోవ పట్టించే కథనాలను ప్రసారం చేస్తున్నందుకు పాకిస్తానీ యూట్యూబ్ చానెళ్లను హోమ్ మంత్రిత్వశాఖ సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం నిషేధించింది' అని అధికారులు వివరించారు. పహల్గామ్‌లో ఇటీవలి భీకర ఉగ్ర దాడికి సంబంధించి ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ బిబిసి ప్రచురించిన ఒక కథనంపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ దాడిని 'తీవ్రవాదుల దాడి'గా అభివర్ణించడాన్ని కేంద్రం ఆక్షేపిస్తూ, బిబిసి పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తోందని ఆరోపించింది. విదేశాంగ శాఖ ఈ మేరకు బిబిసి భారత్ విభాగం అధిపతి జాకీ మార్టిన్‌కు లేఖ రాసింది. 'కాశ్మీర్‌లో దాడి తరువాత భారతీయులకు వీసాలనే పాకిస్తాన్ రద్దు చేసింది' అనే శీర్షికతో బిబిసి ప్రచురించిన కథనంలో పహల్గామ్ ఘటనను ఉగ్రవాద చర్యగా పేర్కొనడానికి బదులు 'మిలిటెంట్ దాడి' అని ప్రస్తావించడంపై కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది వాస్తవాలను వక్రీకరించడమేనని, బాధితుల పట్ల అగౌరవాన్ని సూచిస్తుందని కేంద్రం తన లేఖలో పేర్కొన్నది. ఉగ్ర దాడి తీవ్రతను తగ్గించి చూపే యత్నం చేశారని ప్రభుత్వం విమర్శించింది. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని బిబిసికి సూచిస్తూ, ఈ నెల 22న పహల్గామ్‌లో జరిగిన దాడికి సంబంధించిన పూర్తి వివరాలను కూడా విదేశాంగ శాఖ తన లేఖతో పాటు- పంపింది. 'ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొనడంపై బిబిసికి ఒక లేఖ పంపడమైంది. ఎంఇఎ విదేశీ ప్రచార విభాగం బిబిసి వార్త పంపే తీరును పర్యవేక్షించనున్నది' అని అధికారి ఒకరు తెలియజేశారు. ఆ రోజు పట్టపగలు, రద్దీగా ఉన్న ప్రాంతంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఆ ఘటనను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి కూడా.

# కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదుల వేట

## - నలుగురు ముష్కరులు నక్కిన స్థావరాల గుర్తింపు

## - దొరికినట్లే దొరికి తప్పించుకుంటున్న ఉగ్రవాదులు

## - ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలు లేపేస్తున్న పాక్

(ఆకాంక్ష న్యూస్)

శ్రీనగర్, ఏప్రిల్ 28 : ఓ వైపు పహల్గాం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాల వేట ముమ్మరంగా సాగుతోంది. మరోవైపు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను, పాక్ తరలిస్తోందని సమాచారం అందుతోంది. ఇక పహల్గామ్ నిందితుల్లో ఇప్పటికే ఆ నలుగురి లొకేషన్లను నాలుగుసార్లు ట్రాక్ చేయగా.. వారు త్రుటిలో తప్పించుకొన్నారు. ఒకసారి భద్రతా దళాలు.. ఉగ్రవాదులకు మధ్య కాల్పులు కూడా చోటుచేసుకొన్నాయి. దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో దళాలు పలు సందర్భాల్లో వారికి అత్యంత దగ్గరగా వచ్చాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ఎప్పటికప్పుడు వారి లొకేషన్లను గుర్తిస్తున్నారు. వారు మా కనుచూపు మేరలోకి వచ్చినా.. కాల్పులు జరిపి తప్పించుకొంటున్నారు. ఇక్కడ అడవులు అత్యంత చిక్కగా ఉన్నాయి. మనకు కనిపిస్తున్నా.. ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. వారిని పట్టుకొని తీరతాం. కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉందని ఓ సైనిక అధికారి వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులను తొలుత అనంతనాగ్‌లోని పహల్గాం తెహస్లీ వద్ద గుర్తించారు. కానీ, దళాలు అక్కడికి చేరేలోపు వారు చిక్కటి అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కుల్గాం అడవుల్లో వారి కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై కాల్పులు జరిపి పారిపోయారు. అనంతరం తిరిగి త్రాల్ కొండల్లో వారు ఉన్నట్లు- దళాలు గుర్తించాయి. అక్కడి నుంచి వారు జారుకొన్నాక కొకెర్నాగ్‌లో లొకేషన్ బయటపడింది. వారు ప్రస్తుతం ఈ ప్రాంతం చుట్టు-పక్కలే ఉండొచ్చని చెబుతున్నారు. ఒక గ్రామంలోని ఇంట్లో వారు రాత్రి భోజనానికి వెళ్లగా అక్కడికి దళాలు చేరుకోవడంతో.. ఆహారం తీసుకొని వారు పారిపోయినట్లు- సైనికాధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఉగ్రవాదులు తమకు అవసరమైన నిత్యావసరాల సేకరణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వీరు గ్రామాల సమీపంలోకి వెళ్లినప్పుడు అక్కడ ఉండే స్థానిక సహాయకులను సంప్రదించి అడవుల్లోకి ఆహారం తెప్పించుకొంటారు. ఆ సమయంలో దళాలకు హ్యూమన్ ఇం-టె-లిజెన్స్ లభిస్తుంది. కానీ వీరు చాలా అప్రమత్తంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఉగ్రవాదులు కిష్ట్‌వార్ ప్రాంతంలోకి ప్రవేశిస్తే.. భద్రతా దళాలకు సమస్యలు రావొచ్చని భావిస్తున్నారు. ఇక్కడి పర్వతాలు పహల్గాం వైపు శిఖరాలతో కలిసి ఉంటాయి. తక్కువ మంచు ఉండటంతో.. ఉగ్రవాదులు అక్కడి నుంచి వారు చిక్కటి అడవులు ఉన్న జమ్మూ ప్రాంతంలోకి ప్రవేశించడానికి అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు పహల్గాం చుట్టు-పక్కల అడవులను జల్లెడ పడుతున్నారు. ఉగ్రవాదులు బైసరన్ లోయలో కొందరు సందర్శకుల నుంచి మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు. తమ వారితో మాట్లాడేందుకు వాటిని వాడొచ్చన్న అనుమానాలు ఉండటంతో టె-క్నికల్ ఇంటెలిజెన్స్ బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడితో భారత్- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది.భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటు-న్నట్లు- తెలుస్తోంది.

# ప్రజలకు సహచరుడుగా ఉండి కలిసి పనిచేస్తాను

### -ఏడో వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే రాము
### -తమ సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చిన ప్రజలు





గుడివాడ , (ఆకాంక్ష న్యూస్) :నేను నాయకుడి గాను, సేవకుడిగాను రాలేదనీ, ప్రజలకు సహచరుడిగా వచ్చాననీ... గుడివాడ అభివృద్ధికి వారితో కలిసి పనిచేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ ఏడో వార్డులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం 'మీకోసం మీ వెనిగండ్ల ' ఉదయపు పర్యటన నిర్వహించారు. వార్డులోని కొత్తపేట పరిసర ప్రాంతాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఎమ్మెల్యే రాము స్థానిక ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు సమస్యలను తీసుకొచ్చారు. స్థానికంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు తెలపడంతో.... సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడారు..... కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి గుడివాడలో ప్రజా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. దశాబ్దాలుగా సమస్యలను పట్టించుకునే వారే లేకపోవడంతో.... గుడివాడలో భారీ అగాధం మాదిరి సమస్యలు నెలకొన్నాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ సహకారంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రాష్ట్రం నుండే కాకుండా కేంద్రం నుండి కూడా నిధులు సాధించేందుకు శక్తివంచన లేకుండా అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నామన్నారు. గుడివాడ అభివృద్ధిలో ప్రజలందరూ కూడా భాగస్వామ్యులు కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడో వార్డు కూటమి పార్టీల నాయకులు కునుకు మోహన్, ఏడుకొండలు, పెద్ది కిషోర్, మంగరాజు, స్థానిక ప్రజలు, యువత పాల్గొన్నారు.

# బీసీ సంఘ నేత దారం లేని లోటు తీర్చలేనిది

### -దారం నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రాము
### -దారం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం



గుడివాడ, (ఆకాంక్ష న్యూస్) :అనారోగ్యంతో ఇటీవల మరణించిన బీసీ సంఘ నాయకులు టిడిపి నేత దారం నరసింహారావు కుటుంబ సభ్యులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరామర్శించారు. ఏలూరు రోడ్డులోని దారం ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ముందుగా స్వర్గీయ దారం నరసింహారావు చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే రాము నివాళులు అర్పించారు. అనంతరం దారం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే రాము వారికి మనోధైర్యం చెప్తూ.... దారం నరసింహారావు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. సోదర సమానుడైన దారం నరసింహారావు అకాల మృతి తనను కలచి వేసిందని ఎమ్మెల్యే రాము ఆవేదన వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి నరసింహారావు చేసిన కృషిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము స్మరించుకున్నారు. సోదరుడు స్వర్గీయ దారం నరసింహారావు కుటుంబానికి గుడివాడ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందంటూ ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. దారం కుటుంబ సభ్యులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ అమరావతి పర్యటన విజయవంతం చేద్దాం

### -మాజీ మంత్రి జవహర్,ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
### -గుడివాడ ఖ్యాతిని నిలబెట్టేలా ఎమ్మెల్యే రాము నాయకత్వం లో పని చేస్తామన్న కూటమి నేతలు



గుడివాడ , (ఆకాంక్ష న్యూస్) : ఏపీ రాజధాని అమరావతి తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని... అలాంటి అమరావతి పనులు ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ పర్యాటన విజయవంతంలో భాగస్వామ్యం అవుతామని మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభంలో భాగంగా మే నెల రెండో తేదీన జరిగే ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన విజయవంతానికై గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం (ప్రజా వేదిక)లో.... ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కూటమి పార్టీల ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కొత్తపల్లి శామ్యూల్ జవహర్ పాల్గొని కూటమి నేతలకు సభ నిర్వహణ ఏర్పాట్లు వివరించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి జవహర్ మాట్లాడుతూ....అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి గుడివాడ నియోజకవర్గం నుండి కూటమి శ్రేణులు, ప్రజలుపెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.అమరావతి నిర్మాణ ఆవశ్యకతను మనందరం గుర్తించాలన్నారు.ఐదు లక్షల మందితో సభ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పెద్ద ఎత్తున సభ జరిగేలా సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిలో మనందరం భాగస్వామ్యం అవుదామని కూటమి నేతలకు మాజీ మంత్రి జవహర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ నియోజకవర్గంలోని కూటమి నేతలందరినీ సమన్వయం చేసుకుంటూ... ప్రధాని మోడీ సభలో 15వేల మందికి పైగా గుడివాడ నుండి పాల్గొనేలా కృషి చేస్తామన్నారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రధాని మోడీ సభలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకత్వంలో గుడివాడ ఖ్యాతిని నిలబెట్టేలా సభ విజయవంతంలో గుడివాడ నియోజకవర్గం నుండి భాగస్వామ్యం అవుతామని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గుడివాడ టిడిపి పరిశీలీకురాలు నూకాలమ్మ యాదవ్, జనసేన పార్టీ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సాయన పుష్పావతి, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాలా రాంబాబు, జిల్లా బిజెపి నాయకులు అంగడాల సతీష్, గుడివాడ జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్,టిడిపి నాయకులు అడుసుమిల్లి చిట్టిబాబు, కొడాలి రామరాజు, చాట్రగడ్డ రవి, కంచర్ల సుధాకర్, లింగం ప్రసాద్, నియోజకవర్గ పరిధిలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# వడదెబ్బపై అప్రమత్తత అవసరం

### - వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి
### - జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



ఏలూరు, (ఆకాంక్ష న్యూస్): ఏప్రిల్ 28 : ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ హాల్‌లో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డి ఎం హెచ్ ఓ ఆర్. మాలిని, డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్ కుమార్ లతో కలెక్టర్ సమీక్షించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన పరచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ తగినన్ని నీళ్లు తాగడం, నేరుగా ఎండ వేడిమి తాకకుండా జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని చెప్పారు. ముఖ్యమైన పనుల మినహా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకూడదని, ఈ సమయంలో శారీరక శ్రమ అవసరమైన పనులను నిర్వహించకూడదని సూచించారు. పిల్లలు, గర్భిణీలు మరియు వృద్ధులు ఎండాకాలం మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలు,అధికారులు, సిబ్బంది బయటకు వెళ్లే సమయంలో తల కప్పుకునే విధంగా టోపీలు, గుడ్డ మఫ్లర్లు వాడాలని సూచించారు. లేత రంగుల నూలు దుస్తులు ధరించాలన్నారు. ఆరోగ్యన్నీ దృష్టిలో ఉంచుకుని ఆల్కహాల్, మత్తు పదార్థాలు తీసుకోవడం మానుకోవడం అవసరమని పేర్కొన్నారు. అధిక మసాలా ఉన్న ఆహారం తినకుండా, పోషకతత్వంతో కూడిన తేలికపాటి ఆహారం తీసుకోవాలన్నారు. శుభ్రమైన తాగునీటినే ఉపయోగించాలని, కూల్‌డ్రింక్స్, అధిక చక్కెర ఉన్న పానియాలు, కాఫీ, టీ వంటి పానీయాలను తగ్గించాలని సూచించారు. వడదెబ్బతగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదని, వీలయినంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలన్నారు. చెమట పట్టక పోవడం, వణుకు పుట్టడం మగత నిద్ర లేదా కలవరింతలు, శరీర ఉష్ణోగ్రత పెరగడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వడదెబ్బ లక్షణాలని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో, గ్రామాల్లో ఆశా వర్కర్ల వద్ద ఓఆర్ఎస్అందుబాటులో ఉన్నందున, అవసరమైన వారు దీన్ని ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. తీవ్రమైన వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, సంబంధిత వ్యక్తిని వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

### - అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన శాశ్వత పరిష్కారం చూపాలి..
### - పిజిఆర్ యస్ లో అందిన అర్జీలు 271..
### - జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

ఏలూరు,(ఆకాంక్ష న్యూస్):ఏప్రిల్ 28 : పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలిని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ( పిజిఆర్ యస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జాయింటు కలెక్టరు పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా పంచాయితీ అధికారి కె. అనురాధ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె. భాస్కర్, దేవకిదేవి లతో కలిసి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు నుండి వివిధ సమస్యలపై అందజేసిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని, అధికారులు అందుకుఅనుగుణంగా అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి సత్వరమే పరిష్కారం చూపాలన్నారు.నిర్ణీత గడవులోపుగా ఫిర్యాదులను పరిష్కరించని అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. పి.జి.ఆర్.ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో కొందరు అధికారులు వెనుకబడి ఉంటున్నారని వారందరూ అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఒక సమస్యను పరిష్కరించడం అంటే పని భారాన్ని తగ్గించుకున్నట్లేనని, సరైన పరిష్కారం చూపకపోతే రెట్టింపు పనిభారం పెరుగు తుందని విషయాన్నిఅధికారులు గ్రహించాలన్నారు. అవసరమైతే అధికారులే స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ,అవాస్తవాలను బేరీజు వేసుకుని చక్కని పరిష్కారాన్ని చూపించాలని అన్నారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే అర్జీదారునికి ఏ కారణం చేత సమస్యను పరిష్కారం చేయలేకపోతున్నామో అర్థమయ్యేలా వివరించి సమాధానపరచాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అన్నారు.దెందులూరు మండలం రామారావుగూడెం నివాసి. దాసరి సీతమ్మ నాకు 74 ఏళ్లు నిండాయి.తన భర్త మరణించారని, తన జీవనం సాగించేందుకు వితంతు పెన్షన్ గాని వృద్ధాప్య పెన్షన్ గాని ఏదో ఒకటి మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.

# పిజిఆర్ఎస్ లో అర్జీ పరిష్కారంపై అధికారులకు అభినందనలు తెలిపిన అర్జీదారులు

ఏలూరు,(ఆకాంక్ష న్యూస్) ఏప్రిల్ 28 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్య పరిష్కారం కావడంపై అశోక్ నగర్ కు చెందిన శేఖర్ నగర్, రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. సదరు అభినందనలు తెలుపుతూ అసోషియేషన్ జాయింట్ సెక్రటరీ, కరస్పాండెంట్ అంబికా సుబ్బారావు సోమవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వికి లేఖను అందజేశారు. శేఖర్ నగర్ లో శ్రీ వీరమాచనేని కళ్యాణ మండపం రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు, ప్రమాధాల నియంత్రణకు, యువత మోటార్ సైకిళ్లుతో సవారీలు, స్టంట్లు నివారించడానికి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో అర్జీని అందజేశామని సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు అడిగిన వెంటనే 5 రోజుల్లో ట్రాఫిక్ నియంత్రణకొరకు స్పీడ్ బ్రేకర్లు యుద్ధప్రాతిపధికన ఏర్పాటు చేసినందుకు జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ, డిఎస్పీలకు తమ అసోషియేషన్ తరపున సమిష్టిగా, ఐక్యంగా ముక్తకంఠంతో ప్రశంసలు, అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అంకితభావం, చిత్తశుద్ధి, సేవాభావం ఉద్యోగధర్మం కలిగిన అధికారులు ఏలూరు లో పనిచేయడం ఏలూరు ప్రజల అదృష్టంగా భావిస్తున్నామని అంబికా సుబ్బారావు తెలియజేశారు.

# ఉపాధి వేతన దారులకు ప్రతి రోజు లక్ష పనిదినాలు కల్పించండి

## - కేటాయించిన లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి సారించండి

## - జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




నంద్యాల,(ఆకాంక్ష న్యూస్): ఏప్రిల్ 28 : గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతన దారులకు ప్రతి రోజు లక్ష పనిదినాలు తప్పనిసరిగా కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఎపిడి లను ఆదేశించారు. సోమవారం కమాండ్ కంట్రోల్ రూమ్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఉపాధి హామీ లక్ష్యాపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో డ్వామా పిడి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద వేతన దారులకు ప్రతి రోజు లక్ష పనిదినాలు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. ఆత్మకూరు, నందికొట్కూరు, వెలుగోడు, పగిద్యాల మండలాల్లో తక్కువ వేజ్ రేటు రావడం జరిగిందన్నారు. అదే విధంగా బనగానపల్లె, బేతంచెర్ల మండలాల్లో ఉపాధి లక్ష్యాల సాధనలో తక్కువ పురోగతి ఉందన్నారు. ఔకు, నందికొట్కూరు మండలాల్లో ఉపాధి వేతన దారుని సగటు కూలి అధిక శాతం సాధిస్తుంటే... కొత్తపల్లి, వెలుగోడు, పాములపాడు మండలాలు తక్కువ రేటు రావడానికి గల కారణాలు ఏంటి అని కలెక్టర్ ప్రశ్నించారు. పనులు హాజరైన ఉపాధి హామీ వేతనదారులకు నమోదు చర్యలు చేపట్టి చెల్లింపు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కేటాయించిన లక్ష్యాలపై మూడు నెలలు కష్టపడి చేస్తే మంచి పురోగతి సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఫామ్ ఫాండ్స్ కు సంబంధించి 2500 మంజూరు కాగా 2008 గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. సంజామల, కొత్తపల్లి మండలాల్లో తక్కువ పురోగతి సాధించారని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా అన్ని ఫార్మ్ పాండ్స్ ను గురువారం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల నీటి తొట్లకు సంబంధించి 637 మంజూరు కాగా అందులో 227 మాత్రమే పూర్తి అయ్యాయని కొత్తపల్లి, ఉయ్యాలవాడ, పాములపాడు, దొర్నిపాడు మండలాల్లో తక్కువ పురోగతి సాధించారని ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల షేడ్స్ సంబంధించి దొర్నిపాడు, సిరివెళ్ల మండలాల్లో కూడా పురోగతి శాతం తక్కువగా ఉందని వాటిలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# వివిధ ప్రాజెక్టులకు భూబదలాయింపు చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్

అనంతపురం, (ఆకాంక్ష న్యూస్):ఏప్రిల్ 28 : జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూబదలాయింపు త్వరితగతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో విండ్ పవర్ ప్రాజెక్టులు, ఏపీ జెన్కో, రిలయన్స్ బయోగ్యాస్, ఎంఎస్ఎంఈ పార్కులు, డంపింగ్ యార్డ్, తదితర ప్రాజెక్టులకు సంబంధించి సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ సమక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విండ్ పవర్ ప్రాజెక్టు, ఏపీ జెన్కో, రిలయన్స్ బయోగ్యాస్, ఎంఎస్ఎంఈ పార్కులు, డంపింగ్ యార్డ్, కమ్యూనిటీ భవనాలు, 4జి మొబైల్, డిఎల్డిఓ కార్యాలయం, తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూబదలాయింపు మరియు భూమి అప్పగింతకు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలను వెంటనే పంపాలని ఆదేశించారు. విండ్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి కళ్యాణదుర్గం, శెట్టూరు, కంబదూరు తహసిల్దార్లు జాయింట్ తనిఖీ చేసి ల్యాండ్ ఫిజిబులిటీ రిపోర్ట్ వెంటనే అందజేయాలన్నారు. ఆయా ప్రాజెక్టులకు ప్రాధాన్యతగా భూపదలాయింపు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో ఎన్.హెచ్-544డి, 150ఏ, 426, తదితర రహదారులకు సంబంధించి జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా రహదాలకు సంబంధించి భూసేకరణ పెండింగ్ లేకుండా వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఎన్.హెచ్ పిడి తరుణ్ కుమార్, టెక్నికల్ మేనేజర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు నూతన అసిస్టెంట్ కలెక్టర్ కేటాయింపు

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ను మర్యాద పూర్వకంగా కలిసిన అసిస్టెంట్ కలెక్టర్

## - అసిస్టెంట్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సచిన్ రహర్





అనంతపురం,(ఆకాంక్ష న్యూస్) : ప్రభుత్వం అనంతపురం జిల్లాకు నూతన అసిస్టెంట్ కలెక్టర్ ను కేటాయించింది. ఈ మేరకు సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ను నూతన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. అనంతరం నూతన అసిస్టెంట్ కలెక్టర్ జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మను కలిసి పూల మొక్క అందజేశారు. తదనంతరం కలెక్టరేట్ లోని అసిస్టెంట్ కలెక్టర్ ఛాంబర్ లో నూతన అసిస్టెంట్ కలెక్టర్ గా సచిన్ రహర్, ఐ.ఏ.ఎస్ బాధ్యతలు స్వీకరించారు. రాజస్థాన్ కు చెందిన సచిన్ రహర్ 2024 ఐ.ఏ.ఎస్ బ్యాచ్ కు చెందినవారు.

# తెలుగుదేశం పార్టీలో 100 పైగా కుటుంబాలు చేరికలు

## - అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబునాయుడు-గొట్టిపాటి రవికుమార్

## - సంక్షేమం మరియు అభివృద్ధి ప్రాధాన్యత ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

## - ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు సహకారంతో కందుకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





కందుకూరు,(ఆకాంక్ష న్యూస్) : కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి మద్దతుగా ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామం నుంచి కూనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో 100 పైగా కుటుంబాలు రాష్ట్ర మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా, మంత్రి వర్యులు గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు గారైతే రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుందని నమ్మి గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీని భారీ మెజార్టీతో గెలిపించారని పేర్కొన్నారు.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి వైసిపి పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ వైపు అడుగులు వేస్తున్నారని మంత్రివర్యులు తెలియజేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పథంలో రాష్ట్రం దూసుకుపోతుంది" అని చెప్పారు. స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ పార్టీలో చేరిన నాయకులకు స్వాగతం పలుకుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో కందుకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో పాత కొత్త నాయకులందరూ కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీలో చేరిన కూనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో బద్దిపూడి పంచాయతీ లో వైసీపీ పార్టీకి చెందిన వార్డు సభ్యులు పార్టీ సీనియర్ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు... కూనం రాఘవరెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, కందుకూరు నియోజకవర్గంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మరియు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు నాయకులు, కార్యకర్తలందరూ ఘనంగా సత్కరించారు. ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగల్లు సుబ్బారావు, బ్రహ్మానందరెడ్డి మరియు అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు కూటమినేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

## - ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

## - మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



ప్రకాశం / తూర్పు నాయుడుపాలెం,(ఆకాంక్ష న్యూస్):ఏప్రిల్ 28 :ప్రభుత్వ ఆసుపత్రులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు తమ ప్రభుత్వం కల్పిస్తుందని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం నాడు ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి మరియు కొండపి నియోజకవర్గ వైద్య అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపి ప్రభుత్వ ఆసుపత్రిలో ఐపీ విభాగంలో మేల్ వార్డు, ఫీ మేల్ వార్డు, స్టోర్ రూమ్ లకు సంబంధించి పలు మార్పులపై చర్చించారు. ఒంగోలు రిమ్స్ లో పెయింటింగ్ పనులపై మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి మాట్లాడుతూ..... కూటమి ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు, పరికరాలు ఏర్పాటు చేస్తాం. అధికారులు, వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి మంచి పేరు తీసుకురావాలి. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక వైద్య శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. పేదల కోసం కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చు నైనా భరిస్తుందని మంత్రి తెలిపారు.

# వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తా..!

## - వైసీపీ నూతన కన్వీనర్ మల్లికార్జున రెడ్డి



పొన్నలూరు, (ఆకాంక్ష న్యూస్) ఏప్రిల్ 28: మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్ఆర్ సీపీ నూతన మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జున రెడ్డి అన్నారు. పొన్నలూరులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో అన్ని పంచాయతీల నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసి వైసీపీని అన్ని విధాలుగా బలోపేతం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్యులపై దాడులు చేసి కేసులు పెట్టడం తప్పా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి వారి తరపున పోరాటం చేస్తామన్నారు. 2024 ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ద్వంద వైఖరిని అవలంభిస్తుందన్నారు. రాబోవు రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ కోసం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## చియా సీడ్స్ ఇలా తింటే ప్రమాదం!.. షాకింగ్ నిజం చెప్పిన డాక్టర్



చియా సీడ్స్ మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని చాలామంది వాటిని తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో వీటి వాడకం పెరుగుతుంది. వీటిని నీటిలో నానబెట్టి తాగడం, పాలు లేదా పెరుగులో కలుపుకొని లేదా ఓట్స్ లో నానబెట్టి తినడం వంటివి చేస్తున్నారు. ప్రకృతి అందించిన మల్టీవిటమిన్ పిల్ గా దీనిని అభివర్ణిస్తారు. వాస్తవానికి చియా సీడ్స్ ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్, ప్రొటీన్, కాల్షియం, మెగ్నీషియం వంటి ఇతర ముఖ్యమైన ఖనిజాలకు మంచి మూలం. గుండె ఆరోగ్యానికి, జీర్ణ ఆరోగ్యానికి, బరువు తగ్గడానికి, బ్లడ్ షుగర్ కంట్రోల్ లో ఉండటానికి, ఎముకల బలానికి,శరీరానికి శక్తిని అందించడానికి చియా సీడ్స్ సహాయపడతాయని డాక్టర్లు కూడా చెబుతుంటారు.చియా సీడ్స్ తినేవాళ్లకు అమెరికాకు చెందిన డాక్టర్ జోసెఫ్ సల్హాబ్ షాకింగ్ విషయం చెప్పారు.' ది స్టమక్ డాక్టర్(%ష్టవర్శీఝఎష్ట్రుశీఎ%)'అనే పేరుతో ఉన్న తన ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లో ఆయన పోస్ట్ చేసిన వీడియో ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. చియా సీడ్స్ నేరుగా తింటే హాస్పిటల్ పాలవ్వడం గ్యారెంటీ అని దీనికి సంబంధించిన ఓ సంఘటనను ఆయన వీడియోలో షేర్ చేశారు.ఓ వ్యక్తి చియా సీడ్స్ ని నేరుగా తిన్నాడని, ఆ తర్వాత అవి అతడి శరీరంలోని ఫుడ్ పైప్ లో స్టక్ అయ్యాయని,దీంతో సర్జరీ చేసి అతడి ఫుడ్ పైపులో నుంచి వాటిని తొలగించినట్లు డాక్టర్ జోసెఫ్ చెప్పారు. చియా సీడ్స్ ను ఎప్పుడూ కూడా నేరుగా తినకూడదని డాక్టర్ జోసెఫ్ సూచించారు. అలా తింటే అవి జీర్ణం కావడం కష్టమతుందని.. మీ శరరీరం నుంచి అవి నీటిని లాగడానికి ప్రయత్నిస్తాయని..దీంతో ఉబ్బరం, కడుపులో అసౌకర్యం వంటి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్నారు. కాబట్టి నానబెట్టి మాత్రమే చియా సీడ్స్ తీసుకోవాలని తెలిపారు. చియా గింజలు నానబెట్టడం వల్ల అవి నీటిని పీల్చుకుని జెల్ లాంటి పూతను ఏర్పరుస్తాయి..అప్పుడు వాటిని తీసుకోవడం ద్వారా వాటి ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను శరీరం పొందుతుంది, జీర్ణ వ్యవస్థ సాఫీగా ఉంటుంది. ఎంత మోతాదులో వాడాలి సాధారణం రోజుకి 1-2 టేబుల్ స్పూన్ల చియా సీడ్స్ తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. మొదటిసారి తీసుకునేవాళ్లు తక్కువ మోతాదుతో ప్రారంభించి నెమ్మదిగా పెంచుకోవాలి, చియా సీడ్స్ తీసుకున్నప్పుడు తగినంత నీళ్లు తాగడం చాలా ముఖ్యం అని,ఎందుకంటే ఇవి నీటిని బాగా పీల్చుకుంటాయని చెబుతున్నారు.

## మామిడి పండ్లతో అదిరిపోయే డిజర్ట్..



ఎండాకాలం వచ్చేసింది. ఈ వేసవి కాలం అంటే మనకు ఎక్కువగా గుర్తొచ్చేది మామిడి పండ్ల రుచి. ఎండాకాలంలో పచ్చళ్ళు, తాండ్రలు, ఆమ్‌చూర్‌లు మాత్రమే కాదు.. మామిడి పండ్లతో లలితమైన, చల్లదనాన్ని ఇచ్చే మధురమైన డిజర్ట్ కూడా తయారు చేసుకోవచ్చు. తక్కువ సమయంలోనే తయారయ్యే ఈ ప్రత్యేక డిజర్ట్, వేసవి వేడిని మరచిపోయేలా చేస్తుంది. కానీ చాలా మందికి దీనిని ఎలా తయారు చేసుకోవాలో తెలియదు. అందుకే ఈ స్టోరీలో మామిడి పండ్లతో డిజర్ట్ ఎలా చేసుకోవాలో తెలుసుకుందాం. మామిడి పండ్లతో డిజర్ట్ తయారీకి కావాల్సిన పదార్థాలు: మామిడి పండ్లు – 2 (బంగినపల్లి లాంటి తీపి రకాలు మంచివి) కస్టర్డ్ పౌడర్ లేదా కార్న్ ఫ్లోర్ – 3 టేబుల్ స్పూన్లు చక్కెర – 6 టేబుల్ స్పూన్లు పాలు – 1 లీటర్ మిల్క్ బ్రెడ్ ముక్కలు – 8

మామిడి పండ్లతో డిజర్ట్ తయారీ విధానం:

మామిడి పండ్లను బాగా కడిగి తొక్క తీసి ముక్కలు కట్ చేయండి. ఆ తరువాత పావు కప్పు మామిడి ముక్కలు పక్కన పెట్టుకుని, మిగిలిన ముక్కలతో మిక్సీలో మెత్తగా ప్యూరీ చేయండి. ప్యూరీ నుండి రెండు టేబుల్ స్పూన్లు పక్కన పెట్టుకోండి. మ్యాంగో జెల్ తయారీ: చిన్న గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల మామిడి ప్యూరీకి, కస్టర్డ్ పౌడర్ (లేదా కార్న్ ఫ్లోర్), రెండు టేబుల్ స్పూన్ల చక్కెర కలిపి, 250 మి.లీ. నీరు పోసి బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని మీడియం మంటపై ఉడికిస్తూ సెమీ-థిక్ కాన్సిస్టెన్సీకి వచ్చే వరకు వండండి.

పూర్తిగా చల్లార్చి పక్కన పెట్టండి. కస్టర్డ్ మిల్క్ తయారీ: పావు కప్పు పాలలో కస్టర్డ్ పౌడర్ వేసి ఉండలు లేకుండా కలపండి. స్టవ్ పై అర లీటర్ పాలు వేడి చేసి, అందులో నాలుగు టేబుల్ స్పూన్ల చక్కెర వేసి కలపండి. తర్వాత ముందుగా తయారుచేసుకున్న కస్టర్డ్ మిశ్రమాన్ని పోసి మూడు నిమిషాలు మధ్య మంటపై ఉడికించండి. ఆ తరువాత మంట ఆపి చల్లార్చుతూ పైన మీగడ ఏర్పడకుండా బాగా కలుపుకుంటూ ఉండండి. ఆ తరువాత మిల్క్ బ్రెడ్ ముక్కల అంచులను కత్తిరించి, ముక్కలు తయారు చేసుకోండి. డిజర్ట్ అసెంబ్లీ: ఒక గ్లాస్ బౌల్ తీసుకుని చల్లారిన కస్టర్డ్ మిల్క్ వేసి, దాని పైగా బ్రెడ్ ముక్కలు అమర్చండి. బ్రెడ్ పై మామిడి ప్యూరీ వేసి మరోసారి కస్టర్డ్ మిల్క్ పోయండి. మళ్లీ బ్రెడ్ ముక్కలు అమర్చిన తరువాత మామిడి ప్యూరీ లేయర్ వేసి, చివరగా మ్యాంగో జెల్, మామిడి ముక్కలు వేసి సమానంగా పరచండి. ఆ తరువాత గార్నిష్ కోసం చాప్ చేసిన డ్రై ఫ్రూట్స్ చల్లి అలంకరించండి. ఇప్పుడు ఆ డిజర్ట్‌ను రెండు మూడు గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచి తరువాత చల్లచల్లగా సర్వ్ చేయండి.




అంతే ఎంతో రుచికరమైన సమ్మర్ స్పెషల్ మ్యాంగో డిజర్ట్ సిద్ధమైనట్లే. చివరగా: ఈ వేసవిలో చల్లదనాన్ని కోరుకునేవారికి ఈ మామిడి స్పెషల్ డిజర్ట్ ఖచ్చితంగా నచ్చుతుంది. తక్కువ పదార్థాలతో, తక్కువ సమయంలో తయారయ్యే ఈ రుచికరమైన విందును తప్పకుండా ట్రై చేయండి!

## చుక్క ఆయిల్ అక్కర్లేదు..పొద్దున్నే ఈ జొన్న అంబలి తింటే కొండలు ఢీ కొట్టే శక్తి ..ఎలా చేసుకోవాలంటే



సమ్మర్ బెస్ట్ బ్రేక్ ఫాస్ట్ అంటే చద్దన్నమే. ఎండా కాలంలో పొద్దున్నే చద్దన్నం తింటే కడుపులో హాయిగా ఉంటుంది..మన శరీరానికి కావాల్సిన గుడ్ బ్యాక్టీరియా ఈ చద్దన్నంలో చాలా ఎక్కువగా ఉంటాయి. అయితే బియ్యంతో చేసిన చద్దన్నం తింటే బరువు పెరుగుతారని అంటుంటారు కాబట్టి జొన్నలతో చేసిన చద్దన్నం తినడం బెస్ట్. డయాబెటిస్ పేషెంట్లు కూడా ఈ జొన్నల చద్దన్నం హాయిగా తినొచ్చు. చుక్క ఆయిల్ అవసరం లేకుండానే జొన్న చద్దన్నం లేదా జొన్న అంబలిని ఇంట్లోనే ఈజీగా తయారుచేసుకోడానికి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

జొన్న అంబలి తయారీకి కావాల్సిన పదార్థాలు -జొన్నలు -మజ్జిగ -ఉల్లిపాయ -పచ్చిమిర్చి -నీరు

జొన్న అంబలి తయారీ విధానం -ముందుగా ఒక కప్పు జొన్నలు శుభ్రంగా కడిగి 8-10 గంటలు నానబెట్టుకోవాలి. -తర్వాత జొన్నలలోని నీళ్లు మొత్తం ఒంపేసుకొని నానిన జొన్నలను మిక్సీలో వేసి నీళ్లు పోయకుండా గ్రైండ్ చేసుకోవాలి. మరీ మెత్తగా కాకుండా పలుకుగా ఉండేలా గ్రైండ్ చేసి ఈ ఆ పొడిని ఓ గిన్నెలో వేసి అందులో ఓ గ్లాసు నీళ్లు పోసి పక్కనపెట్టుకోండి. -తర్వాత స్టవ్ మీద అడుగు మందం కలిగిన గిన్నె పెట్టి అందులో 4 కప్పుల నీళ్లు పోసి మూత పెట్టి మరిగించుకోవాలి.

-నీళ్లు మరిగాక అందులో నీళ్లు కలిపిన జొన్న పిండిని వేసి ఉండలు కట్టకుండా కలపాలి. చిక్కబడేంత వరకు కలుపుతూ ఉడికించుకోవాలి. -చిక్కబడిన తర్వాత మంటను తక్కువగా పెట్టి మూతపెట్టేసి మధ్య మధ్యలో కలుపుతూ ఉడికించుకోవాలి. ఇది ఉడకడానికి 15 నిమిషాలు పడుతుంది. -ఉడికిన తర్వాత దీన్ని దించేసి కనీసం 8 గంటల పాటు లేదా రాత్రంతా పులియనివ్వాలి. ఇదే అరలీటరు పాలు కాచి వాటిలో తోడు వేసి ఉంచండి. -తెల్లారిన తర్వాత తోడు వేసిన పెరుగులో కొంచెం నీళ్లు పోసి బాగా చిలికి ఆ మొత్తాన్ని జొన్నల అన్నంలో పోసి బాగా కలపాలి. అందులోనే పచ్చిమిరపకాయ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేసి కలుపుకుంటే జొన్న చద్దన్నం లేదా జొన్న అంబలి రెడీ.

## రాజుల కాలం నాటి వంట..




రాజుల కాలంలో ఉల్లి, వెల్లుల్లి, టమాటోలు వంటివి వాడకుండా కొన్ని రకాల కూరగాలయలతో ఓ ప్రత్యేకమైన కర్రీ తయారుచేసేవాళ్లు. మన అమ్మమ్మల కాలంలో కూడా ఈ కర్రీ చాలా ఫేమస్. ముఖ్యంగా సాత్విక భోజనం తినేవాళ్లు ఈ కర్రీని ఎక్కువగా చేసుకొని తినేటోళ్లు. ఈ కూర తిన్నారంటే ఎవరైనా మైమర్చిపోవాల్సిందే. మంచి గ్రేవీతో ప్రత్యేకమైన రుచి ఉండే ఈ కూర తినాలంటే అదృష్టం ఉండాలి అంటారు. ఈ కూర అన్నం, చపాతీ, జొన్న రొట్టెలు ఎందులోకైనా అదిరిపోతుంది. రాజుల కాలం నాటి మిక్స్ వెజిటేబుల్ కర్రీ మీరు కూడా మీ ఇంట్లో ఎలా తయారు చేసుకోవాలో ఇక్కడ చూడండి.తయారీకి కావలసిన పదార్థాలు -జీలకర్ర -గసగసాలు -పచ్చి కొబ్బరి -దొండకాయ -వంకాయ -బంగాళదుంప -ఆవాల నూనె లేదా గానుగ నూనె -ముల్లంగి -గుమ్మడికాయ ముక్కలు -ఆవాలు -ఉప్పు -పచ్చి అరటికాయ -బీన్స్ -ఎండు మిర్చి -బిర్యానీ ఆకు -పచ్చిమిర్చి -పసుపు.

తయరీ విధానం -ముందుగా ఓ గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల పెద్ద ఆవాలు, 1 టేబుల్ స్పూన్ జీలకర్ర, 3 టేబుల్ స్పూన్ల గసగసాలు వేసి వీటిలో నీళ్లు పోసి కనీసం అరగంట పాటు నానబెట్టుకోవాలి. -తర్వాత వాటిని నీళ్లతో పాటు మిక్సీ గిన్నెలో లేదా రోట్లో వేసి ఇందులో రెండు అంగుళాల అల్లం ముక్కలు,గుప్పెడు పచ్చి కొబ్బరి ముక్కలు వేసి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసి గిన్నెలోకి తీసుకొని పక్కన పెట్టుకోండి.


-తర్వాత స్టవ్ మీద కడాయి పెట్టి అందులో రెండు స్పూన్ల ఆవాల నూనె వేడి చేసి అందులో 1 కప్పు బంగాళదుంప ముక్కలు, 1 కప్పు బీన్స్ వేసి ఇందులోనే కొంచెం ఉప్పు వేసి కలుపుతూ ఎక్కువ మంట మీద వేయించి వాటిని నూనె రాకుండా ఓ గిన్నెలోకి తీసి పక్కనపెట్టుకోండి. -తర్వాత అదే కడాయిలో మిగిలిన నూనెలోని 1 కప్పు దొండకాయ చీలికలు, 1 కప్పు ముల్లంగి ముక్కలు వేసి ఇందులోనే చిటికెడు ఉప్పు వేసి పెద్ద మంట మీద కలుపుతూ వేయించి పక్కన పెట్టుకోండి. -తర్వాత కడాయిలో మరో స్పూన్ ఆయిల్ వేసి అందులో 1 కప్పు పచ్చి అరటికాయ ముక్కలు, 1 కప్పు పచ్చ వంకాయ ముక్కలు వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. -తర్వాత కడాయిలో 5-6 టేబుల్ స్పూన్ల ఆయిల్ పోసి వేడయ్యాక అందులో 1 ఎండుమిర్చి ముక్కలు, 1 బిర్యానీ ఆకు వేసి వేగాక అందులో గ్రైండ్ చేసి పెట్టుకున్న మసాలా పేస్ట్ వేసి కలుపుతూ వేయించుకోవాలి. కొద్దిగా వేగాక ఇందులో 10 పచ్చిమిర్చిలను కచ్చాపచ్చాగా దంచి వేసి ఇందులోనే పసుపు, ఉప్పు వేసి బాగా కలిసేలా కలపాలి. -మసాలా పేస్ట్ వేగి కొంచెం ఆయిల్ పైకి కనిపిస్తున్న సమయంలో అందులో 1 కప్పు గుమ్మడికాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి తక్కువ మంట మీద 5-6నిమిషాలు ఉడికించుకోవాలి. అడుగుపట్టకుండా మధ్య మధ్యలో మూత తీసి కలుపుకోవాలి. -గుమ్మడికాయ ముక్కలు 50శాతం వరకు ఉడికిన తర్వాత అందులో ముందుగా వేయించి పెట్టుకున్న కూరగాయల ముక్కలు అన్నీ వేసి మసాలా అంతా వాటికి పట్టేలా బాగా కలుపుకోవాలి. -తర్వాత అందులో గ్రేవీకి తగ్గట్లుగా కొన్ని నీళ్లు పోసుకోండి. ముక్కలన్నీ బాగా ఉడికిన తర్వాత కొత్తిమీర చల్లి దించేసుకోవాలి. అంతే రాజుల కాలం నాటి కూరగాయ ముక్కల వంట రెడీ.

# సినిమా న్యూస్



## మళ్లీ వైరల్ అవుతున్న వింక్ బ్యూటీ

మలయాళీ ముద్దుగుమ్మ ప్రియా ప్రకాష్ వారియర్ సోషల్ మీడియా కారణంగా పాన్ ఇండియా రేంజ్ గుర్తింపు దక్కించుకుంది. ఒక్క సినిమా హిట్ కాకుండానే ఈ అమ్మడికి జాతీయ స్థాయిలో స్టార్‌డం దక్కింది. ఒరు ఆదార్ లవ్ సినిమాలోని ముద్దుగన్ పేల్చడంతో పాటు, కన్ను గీటే సన్నివేశం కారణంగా ఈమెకు వచ్చిన పాపులారిటీతో ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశం దక్కించుకుంది. హీరోయిన్‌గా పలు సినిమాల్లో నటించినా పెద్దగా సక్సెస్‌లు దక్కించుకోలేక పోతున్న ఈ అమ్మడు




ఇటీవల తమిళ్ స్టార్ హీరో అజిత్ నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో గెస్ట్ రోల్‌లో కనిపించడంతో పాటు, ఐటెం సాంగ్‌లోనూ నటించడం ద్వారా వార్తల్లో నిలిచింది. అజిత్ గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో బాక్సాఫీస్ వద్ద దాదాపుగా రూ.200 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం అందుతోంది. ఆ స్థాయి వసూళ్లు నమోదు కావడంతో మాత్రమే కాకుండా సినిమాలో ఆమె పాత్రకు, ఆమె ఐటెం సాంగ్‌కి మంచి గుర్తింపు దక్కింది. సినిమాలో కనిపించింది కొద్ది సమయం అయినా కూడా నోటెడ్ అయింది. దాంతో ప్రియా ప్రకాష్ వారియర్‌కి ఆ సినిమా ముందు ముందు మరిన్ని ఆఫర్లు తెచ్చి పెట్టే అవకాశాలు ఉన్నాయని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సినీ విశ్లేషకులు సైతం ప్రియా ప్రకాష్ వారియర్ కెరీర్ గాడిలో పడ్డట్లే అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా మరోసారి ప్రియా ప్రకాష్ వారియర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో ఈమె చేసిన పాటకు సంబంధించిన క్లిప్స్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. సినిమా విడుదల కాక ముందు పెద్దగా ఈ పాటను జనాలు పట్టించుకోలేదు. ఎప్పుడైతే సినిమా విడుదలైందో పాటకు మంచి స్పందన దక్కింది. యూట్యూబ్‌లో అత్యధిక వ్యూస్‌ను రాబడుతూ దూసుకు పోతుంది. ఇటీవల వచ్చిన వీడియో సాంగ్‌కి మంచి స్పందన వస్తోంది. అత్యధిక వ్యూస్‌ను దక్కించుకోవడం మాత్రమే కాకుండా చాలా మంది ఈ పాటను షార్ట్ వీడియో షేర్ చేయడం లేదంటే రీల్స్‌గా షేర్ చేయడం చేస్తున్నారు. తద్వార ప్రియా ప్రకాష్ వారియర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చాలా కాలం తర్వాత ఈ అమ్మడు నెట్టింట ఈ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

## మూడో బిడ్డతో శ్రీలీల



హీరోయిన్ శ్రీలీల వయసు చిన్నదే కానీ ఆమె ఆలోచన విధానం చాలా పెద్దది. నిండా పాతికేళ్లు లేని ఈ హీరోయిన్ ఎంతో మంది హీరోలు, హీరోయిన్స్ చేయలేని పనిని చేస్తూ తన మంచి మనసు చాటుకుంటుంది. సాధారనంగా అనాథలకు సహాయంగా నిలిచేందుకే పలువురు సెలబ్రిటీలు ఆసక్తి చూపించరు. అలాంటిది శ్రీలీల ఏకంగా ఇద్దరు వికలాంగులు అయిన పిల్లలను దత్తత తీసుకుని వారి ఆలనా పాలన చూస్తూ, తాను కూడా సమయం దొరికినప్పుడు వారితో ఆడుకుంటూ కనిపిస్తూ ఉంటుంది. శ్రీలీల ఇద్దరు పిల్లలను ఎంతో అల్లారు ముద్దుగా చూసుకుంటూ వారికి కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తూ ఉంటుంది. శ్రీలీల మంచితనం గురించి ఎంత చెప్పినా తక్కువే అంటూ ఆమె అభిమానులు అంటూ ఉంటారు. ఇప్పటికే ఇద్దరు పిల్లలకు తల్లిలా ఆలనా పాలన చూసుకుంటూ ఉన్న శ్రీలీల మరో పాపను తన ఇంటికి తీసుకు వచ్చినట్లు చెప్పుకొచ్చింది. ఒక చిన్నారికి ముద్దు పెడుతూ ఉన్న ఫోటోను శ్రీలీల షేర్ చేసింది. ఆ ఫోటోతో పాటు... ఇంటికి మరొకరు, హృదయాలను నింపేందుకు ఈ పాప వచ్చింది అన్నట్లుగా కామెంట్ పెట్టింది. ఇప్పటికే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్న శ్రీలీల మరో పాపను దత్తత తీసుకోవడం అనేది చాలా గొప్ప విషయం. ఆమె యొక్క మంచితనం ముందు ఇతర స్టార్ హీరోలు, హీరోయిన్స్ బలాదూర్ అంటూ కామెంట్ చేస్తున్నారు. ముందు ముందు ఈమె మరింత మందికి సహాయం గా నిలవాలని అభిమానులు కోరుకుంటున్నారు. అందమైన రూపం ఉన్నవారికి అందమైన మనసు ఉండదని కొందరు అంటూ ఉంటారు. కానీ శ్రీలీల మాత్రం అందంగా ఉండటంతో పాటు అంత మంచి మనసు కలిగి ఉన్నది అనడంలో సందేహం లేదు. నటిగా ఎంత బిజీగా ఉన్నా ఆ పిల్లలతో సరదాగా సమయంను గడిపేందుకు శ్రీలీల సమయం కేటాయిస్తూ ఉంటుంది. పుష్ప 2 సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో దక్కిన గుర్తింపు కారణంగా హిందీలో ఒక సినిమాను ఈమె చేసే అవకాశం దక్కించుకుంది.త్వరలోనే ఈమె మరో భారీ తెలుగు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది.


## నాని బుకింగ్స్ తోనే కిక్కిస్తున్నాడుగా..



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన హిట్ 3 సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. క్రైమ్ థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ సినిమాను శైలేష్ కొలను తెరకెక్కించారు. హిట్ యూనివర్స్‌లో మూడో భాగంగా వస్తున్న ఈ సినిమా మే 1న థియేటర్లలో సందడి చేయబోతోంది. ఇప్పటికే ప్రమోషన్స్, ట్రైలర్‌లు, గ్లింప్స్‌తో సినిమాపై మంచి హైప్ క్రియేట్ అయ్యింది. ప్రత్యేకించి ఈసారి నాని చాలా నమ్మకంగా కనిపిస్తున్నాడు. హిట్ 1, హిట్ 2 సినిమాలకు మంచి రెస్పాన్స్ వచ్చిన తర్వాత, హిట్ 3ను మరింత భారీ స్థాయిలో తీసుకొచ్చారు. నాని సరికొత్త షేడ్స్ చూపించనున్న ఈ సినిమా, కథలో మలుపులతో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతోందని ట్రైలరే చెప్పేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రేక్షకుల్లో భారీ స్థాయిలో ఆసక్తి ఏర్పడింది. ఫ్యాన్స్ మాత్రమే కాకుండా, జనరల్ ఆడియన్స్ నుంచి కూడా సినిమాపై మంచి రెస్పాన్స్ వస్తోంది. లేటెస్ట్ గా అందుతున్న సమాచారం ప్రకారం, హిట్ 3 అడ్వాన్స్ బుకింగ్స్ దుమ్మురేపుతున్నాయి. యుఎస్‌లో మాత్రమే ప్రీమియర్ షోల ద్వారా ఇప్పటివరకు 2 కోట్ల రూపాయలకు పైగా కలెక్షన్స్ వచ్చాయని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ సిటీలోనే తొలి రోజు బుకింగ్స్ 1.5 కోట్ల రూపాయలు దాటి పోయాయి. బుక్‌మైషోలో ఇప్పటికే 50 వేలకు పైగా టిక్కెట్లు సేల్ అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఓపెనింగ్ డే అడ్వాన్సులు సుమారు 5 కోట్ల రూపాయల దాకా నమోదయ్యాయని సమాచారం. ఇంకా అసలు ఫన్ను మిగిలే ఉంది. మే 1న రిలీజ్ నేపథ్యంలో, నేటి నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా మాస్ సెంటర్స్, మల్టీప్లెక్స్‌లలో హిట్ 3కు భారీ ఓపెనింగ్ కనిపించేలా ట్రెండ్ కొనసాగుతోంది. తొలిరోజు వసూళ్ల పరంగా కూడా ఈ సినిమా నాని కెరీర్‌లో బెస్ట్ ఓపెనింగ్ అందుకునే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు వచ్చిన ప్రీ రిలీజ్ బజ్‌ని బట్టి చూస్తే హిట్ 3కు టాక్ నెగటివ్ కాకపోతే మినిమమ్ హిట్ అయితే ఖాయం అంటున్నారు విశ్లేషకులు. స్టోరీ, న్యారేషన్ పక్కాగా ఉంటే ఇది బాక్సాఫీస్ వద్ద మేజర్ సక్సెస్ అవ్వడం ఖాయం. ముఖ్యంగా నాని బ్లాక్‌బస్టర్ ట్రాక్‌లో మూడో విజయం కూడా ఖరారు కావొచ్చని అభిమానులు నమ్ముతున్నారు. మరి మే 1న హిట్ 3 ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.

## డ్రాగన్ కయాదు కి బిగ్ ఛాన్స్

ఈ మధ్య కాలంలో తమిళ్‌తో పాటు తెలుగు ఇతర సౌత్ ఇండియన్ భాషల్లో ఎక్కువగా వినిపిస్తున్న హీరోయిన్స్ పేర్లలో కయాదు లోహర్ ఒకటి. ఈ అమ్మడు కన్నడ మూవీ ముగిల్పేటతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. ఆ తర్వాత మలయాళ సినిమా పతోన్పథం నూత్తండులో నటించింది. ఆ వెంటనే తెలుగు సినిమా అల్లూరి లో ఈమె నటించింది. కన్నడం, మలయాళం, తెలుగు సినిమాల తర్వాత ఈమెకు మరాఠీ సినిమాలో ఆఫర్ దక్కింది. 2023లో మరాఠి మూవీ ఐ ప్రేమ్ యు సినిమాలో నటించడం ద్వారా తమిళ్ మూవీ 'డ్రాగన్'లో ఛాన్స్ దక్కింది. ప్రదీప్ రంగనాథన్ కి జోడీగా కయాదు లోహర్ ఒక హీరోయిన్‌గా నటించి మెప్పించిన విషయం తెల్సిందే. అంతకు ముందు చేసిన సినిమాలు పెద్దగా హిట్ కాకపోవడంతో ఆఫర్లు అడపా దక్కించుకుంటూ వచ్చిన కయాదు లోహర్ 'డ్రాగన్' సినిమా సూపర్ హిట్ కావడంతో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకుంది. కోలీవుడ్‌లో ఏకంగా స్టార్ హీరో శింబు సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఇప్పటికే ఈమె తమిళ్ మూవీ ఇదయం మురళి లో నటిస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమా ఇంకా విడుదల కాకుండానే తమిళ్ స్టార్ హీరో శింబుతో నటించేందుకు రెడీ అయింది. తాజాగా శింబు 49 చిత్ర యూనిట్ సభ్యులు కయాదు లోహర్ కు వెల్‌కమ్ చెబుతూ సోషల్ మీడియా ద్వారా ఒక పోస్ట్‌ను షేర్ చేశారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి నటన ప్రతిభ ఈ అమ్మడి సొంతం అని డ్రాగన్ సినిమాతో నిరూపితం అయ్యింది. టాలీవుడ్‌లో ఈమె ఇప్పటికే అల్లూరి అనే సినిమాలో నటించింది. కానీ తెలుగులో గుర్తింపు



దక్కలేదు. డ్రాగన్ సినిమా తెలుగు వర్షన్ కారణంగా ఈ అమ్మడికి గుర్తింపు దక్కింది. తెలుగులో ఈ అమ్మడికి ఇప్పటికే ఒకటి రెండు ఆఫర్లు వచ్చాయని, చర్చల దశలో ఉన్న ఆ సినిమాలు ఈ ఏడాదిలోనే ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అతి త్వరలోనే కయాదు లోహర్ తమిళ్, తెలుగు సినిమాల్లో మరింత బిజీ కావడం ఖాయం అంటూ సినీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కయాదు లోహర్ ఓకే చెప్పాలే కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆమె ఏడాదిలో అరడజను సినిమాలను చేయగలదు అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు. కయాదు లోహర్ తన కెరీర్‌ను ఆభరణాల ప్రమోషన్‌తో ప్రారంభించింది. 2021లో టైమ్స్ ఫ్రెష్ ఫేస్ కాంపిటీషన్‌లో పాల్గొనడంతో కన్నడ సినిమాలో అవకాశం దక్కించుకుంది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH, Karimnagar (Dist.), Telangana-505001, Editor: PENAGONDA SATHISH. RNI.No. T/TG/2024/0523/7229/1544 Cell: 8333818121, email: akankshanewsdaily@gmail.com